

మిట్ట మధ్యాహ్నం గ్రీన్‌ఫీల్డ్ హైవే పై మంత్రి తుమ్మల

- అధికారులతో కలిసి ఐదున్నర గంటలపాటు 100 కిలోమీటర్ల ప్రయాణం
- హైవేపై కల్వర్టులు, ఫ్లై ఓవర్ల పనుల పరిశీలన
- పలుచోట్ల రైతులతో మాటామంతీ...
- హైవేతో ఉత్తర, దక్షిణాది ప్రాంతాలు అనుసంధానం అవుతాయని వెల్లడి
- ఆగస్టు 15 నాటికి పనులన్నీ పూర్తి చేస్తామని ప్రకటన
- మంత్రి వెంట ఎమ్మెల్యేలు రాగమయి, రాందాస్ నాయక్
- ఖమ్మం జిల్లా పరిధిలో రూ.2214 కోట్లతో కొనసాగుతున్న పనులు



కొనసాగుతున్న పనులు



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

నడి ఎండలో నాయకుడి యాత్ర

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే పనులను పరిశీలించిన మంత్రి తుమ్మల



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

ఖమ్మం, మే 15 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఖమ్మం జిల్లా పరిధిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మాణమవుతున్న ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. మండే ఎండలో ఐదున్నర గంటలపాటు సుమారు 100 కి.మీ. హైవేపై కారులో ప్రయాణించి రహదారి పనులను పరిశీలించారు. ఆయన వెంట నేషనల్ హైవే రెవెన్యూ, ట్రాన్స్‌కో తదితర శాఖల అధికారులు, సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్ ఉన్నారు.

ఏపీలోని చింతలపూడి మండలం గుడిపట్లగూడెం గ్రామం నుంచి వేంసూరు, కల్లూరు, పెనుబల్లి, తల్లాడ, వైరా, కొణిజర్ల, ఖమ్మం అర్బన్ మండలాల మీదుగా ధంసలాపురం వరకు ఐదున్నర గంటలపాటు హైవే పనులను పరిశీలించారు. పలు చోట్ల కల్వర్టులు, అండర్‌పాస్‌లు, బ్రిడ్జిలతో పాటు ఫ్లైఓవర్ పనులను తిలకించారు. హైటెన్షన్ క్రాస్‌లైన్లను పరిశీలించారు. పనులు సత్వరం పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే మంజూరుతో పాటు నిర్మాణ పనుల్లో ప్రత్యేక చొరవ చూపుతున్న మంత్రి తుమ్మలకు హైవే సమీప గ్రామాల రైతులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా పలు గ్రామాల ప్రజలు తమకు సర్వీసు రోడ్లు కావాలని విజ్ఞప్తి చేశారు. ధంసలాపురం వద్ద ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, పీడీ దివ్యతోపాటు నేషనల్ హైవే, రెవెన్యూ, ట్రాన్స్‌కో, రైల్వే అధికారులతో మంత్రి మాట్లాడారు. ధంసలాపురం వద్ద ఫై ఓవర్‌బ్రిడ్జి ఎగ్జిట్ రహదారి, బ్రిడ్జిపై హైటెన్షన్ వైర్ల తొలగింపు సత్వరం చేపట్టాలని అధికారులకు సూచించారు.

80 శాతం పనులు పూర్తి

హైవే పరిశీలన అనంతరం ఖమ్మంలోని ధంసలాపురంలో మంత్రి తుమ్మల విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ తెలంగాణ, ఏపీలో మొత్తం (మిగతా 6వ పేజీలో)

దళారులను లోపలేయిస్తా...

- డబ్బుల కోసం ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారులను బెదిరిస్తే ఊరుకునేది లేదు
- సంక్షేమ పథకాల కోసం ప్రజలు ఎవరికీ ఒక్కరూపాయి ఇవ్వొద్దు
- మంత్రి పొంగులేటి చొరవతో అదనంగా 700 ఇండ్లు
- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పాయం

మణుగూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) : 'ప్రజాపాలనలో అర్హులైన నిరుపేదలకే ప్రభుత్వ పథకాలు అందుతాయి.. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదు.. దళారులు, పైరవీకారులు కొందరు ఉంటారు.. నాకు తెలుసు.. సమాచారం కూడా వస్తోంది.. మీరెవ్వరూ ఇందిరమ్మ ఇళ్లకో, షాదీముబారక్, కల్యాణలక్ష్మి చెక్కులకో రేషన్ కార్డులకో ఒక్క పైసా ఎవరికీ ఇవ్వనవసరం లేదు..' అని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. మణుగూరు తహసీల్దార్ కార్యాలయంలో గురువారం సాయంత్రం షాదీ ముబారక్, కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఆయన ప్రజలనుద్దేశించి మాట్లాడారు. పూర్తి పారదర్శకతతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయడం (మిగతా 6వ పేజీలో)

'కొనుగోలు కేంద్రాల వద్ద అవసరమైన రవాణా వాహనాలు, హమాలీ సమస్యలు రాకుండా చూసుకోవాలి.. అధికారులు నిత్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షిస్తూ రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి.. ఏవైనా సమస్యలు ఉత్పన్నమైతే వెంటనే జిల్లాస్థాయి అధికారుల దృష్టికి తీసుకురావాలి.. జిల్లాలో ప్రతి మండలంలో అధికారులు చొరవ తీసుకొని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు జరిగేలా చూడాలి...' ఇవి సమీక్ష సమావేశాల్లో జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ చేసిన సూచనలు.



కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం ఇలా

అన్నదాతకు అష్టకష్టాలు

- ధాన్యం విక్రయంలో నానా వెతలు
- తూకంలో తగ్గింపు.. తరలింపులో జాప్యం
- తమ వంతు కోసం అన్నదాతల నిరీక్షణ
- కొనుగోలు కేంద్రాలపై కానరాని పర్యవేక్షణ

ఖమ్మం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో పండించిన వరి ధాన్యం విక్రయానికి అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. జిల్లాలో కొనుగోలు కేంద్రాల్లో నేటికీ తూకాల్లో తీవ్ర జాప్యం జరుగుతోంది. అంతేకాదు క్వింటాకు 5 కేజీల చొప్పున మిల్లర్లు తరుగు తీస్తూనే ఉన్నారు. ఏఈవోలు నాణ్యమైన ధాన్యం అంటూ ధ్రువీకరిస్తున్నా మిల్లర్లు మాత్రం నూక శాతం ఎక్కువగా ఉంటున్నదనే కారణంతో 5 కేజీలు తగ్గించి తీసుకుంటున్నారు. అసలే అకాల వర్షాలకు ధాన్యం తడిసి ముద్దవుతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తుంటే ఇలాంటి కొర్రీలు వారిని మరింత దైన్యస్థితికి తీసుకెళ్త న్నాయి. కొనుగోలు కేంద్రాల్లో కనీస మౌలిక వసతులు కనిపించడంలేదు.. వివిధ మండలాల్లో హమాలీ, కూలీల కొరత వేధిస్తోంది. చాలాచోట్ల కొనుగోలు కేంద్రాల పర్యవేక్షణను క్షేత్రస్థాయిలో అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.



తేమ శాతాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

రవాణాకు ఇక్కట్లు

దీనికి తోడు రవాణాకు లారీలు రాక నానా అవస్థలు పడుతున్నారు. వెంకటాయపాలెం కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం లారీలు రాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కాంటాలు వేసిన ధాన్యాన్ని తరలించేం దుకు లారీలు రాకపోవడం వల్ల రైతులు వాటి కోసం నిరీక్షించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. దీనితో కొనుగోళ్లను కూడా చేయడం లేదని ఆరోపిస్తున్నారు. వాతావరణంలో వస్తున్న మార్పులకు కొనుగోలు కేంద్రాల్లో పోసిన ధాన్యం తడిచి పోతోందేమో అనే ఆవేదన రైతులు వ్యక్తం చేస్తుంటే కొనుగోలు కేంద్రాల్లో మాత్రం అలక్ష్యంగా ఉంటున్నారని ఆరోపిస్తున్నారు.

1.33 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

జిల్లాలో గురువారం వరకు 17,321మంది రైతుల నుంచి రూ.308కోట్ల విలువైన 1,33,325.160 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు సరఫరా చేసినట్లు చూపిస్తున్నా.. చాలా చోట్ల ధాన్యం అలాగే ఉందని తెలుస్తోంది. జిల్లాలో 351 కేంద్రాలను తెరవగా ధాన్యం కొనుగోళ్లు మాత్రం 285లోనే చేపట్టారు. కొనుగోలు చేసిన ధాన్యంలో ఇప్పటి వరకు రూ.246.09 కోట్లను బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. ఇంకా 62.05కోట్లు రైతులకు ఇవ్వాల్సి ఉంది. వీటిలో 72,345.320 మెట్రిక్ టన్నుల సన్నధాన్యం సేకరించారు.

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

- తెలుగు జాతి ఖ్యాతిని చాటిచెప్పిన యుగ పురుషుడు
- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ కూటమిదే అధికారం
- ఎన్టీఆర్ వారసుడు నందమూరి రామకృష్ణ
- యజ్ఞ నారాయణపురంలో విగ్రహావిష్కరణ



వైఎస్.పురంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నందమూరి రామకృష్ణ

కల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) తెలుగుజాతి ఖ్యాతిని ప్రపంచానికి చాటి చెప్పిన యుగ పురుషుడు తన తండ్రి ఎన్టీ రామారావు అని నందమూరి రామకృష్ణ కీర్తించారు. కల్లూరు మండల పరిధిలోని యజ్ఞనారాయణపురంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహాన్ని గురువారం ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్ ఇన్‌చార్జి టీడీ జనార్ధన్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో కలిసి ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా నందమూరి అభిమానులు ఏర్పాటు చేసిన సభలో రామకృష్ణ ప్రసంగించారు.

చలనచిత్ర రంగంతో పాటుగా రాజకీయ రంగంలో రాణించి మహనీయుడిగా ఎన్టీఆర్ నిలిచారని, టీడీపీని స్థాపించిన 9 నెలల కాలంలోనే అధికారంలోకి వచ్చిన తరువాత కేంద్రంలో ఉన్న నాటి ప్రభుత్వాన్ని వణికించిన గొప్ప నేత అని పేర్కొన్నారు. ఉమ్మడి ఏపీ ముఖ్యమంత్రిగా అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టి దేశ స్థాయిలోనే ఆదర్శంగా నిలిచారని అన్నారు. రాయలసీమ, కోస్తా ప్రాంతాల్లో వరదలతో ప్రజలు తీవ్రంగా నష్ట పోగా.. వారిని ఆదుకునేందుకు చిత్రపరిశ్రమను ఏక తాటిపైకి తెచ్చి జోలెపట్టి విరాళాలు సేకరించి వరద బాధితులను చేయూత నిచ్చిన ఘనత ఆయనదేనన్నారు. తెలుగుజాతి ఉన్నంత వరకు ఎన్టీఆర్ ప్రజల హృదయాల్లో ఎప్పటికి నిలిచి ఉంటారన్నారు. ఎన్టీఆర్ 40ఏళ్ల క్రితం ప్రారంభించిన రెండు రూపాయలకు కిలో బియ్యం, పక్కా గృహాలు వంటి పథకాలను (మిగతా 6వ పేజీలో)

సాగర్ కాల్వకు శాశ్వత మరమ్మతులు

పరిశీలించిన ఐబీ ఎస్ఈ ఎం.వెంకటేశ్వర్లు 6




ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూసుమంచి మండలం మల్లాయిగూడెం వద్ద యూటీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

తహసీల్దార్ల బదిలీలు

ఖమ్మం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి) : గత సార్వత్రిక ఎన్నికలకు ముందు రాష్ట్ర వ్యాప్తంగా బదిలీలు చేసిన తహసీల్దార్లను తిరిగి వారి జిల్లాలకు కేటాయిస్తూ ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎన్నికలకు ముందు 2023 ఆగస్టులో జిల్లా నుంచి 15 మందిని తహసీల్దార్లను వివిధ జిల్లాలకు బదిలీ చేసింది. ఎన్నికలు పూర్తయి తిరిగి వారి సొంత జిల్లాలకు పంపించాల్సిన ప్రభుత్వం ప్రత్యేక జీవోను అమలుచేస్తూ సొంత జిల్లాలకు బదిలీ చేసేది లేదంటూ తేల్చి చెప్పింది. ఈ నేపథ్యంలోనూ గురువారం జరిగిన బదిలీల్లోనూ (మిగతా 6వ పేజీలో)

ఇసుక దందాపై పోలీస్ నజర్



- ఏపీ నుంచి అక్రమ రవాణాపై జిల్లా పోలీస్ అధికారి సీరియస్
- ఆంధ్రా సహా సత్తుపల్లికి చెందిన అక్రమార్కులపై నిఘా
- పట్టుబడిన విస్సన్నపేట వ్యాపారికి చెందిన ఇసుక లారీ

సత్తుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నుంచి సత్తుపల్లి నియోజకవర్గానికి కొద్ది నెలలుగా సాగుతున్న ఇసుక అక్రమ రవాణాపై జిల్లా పోలీసు యాంత్రాంగం దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. ఈ దందాపై జిల్లాలోని ఓ పోలీసు అధికారి సీరియస్ అయినట్లు సమాచారం. ఆంధ్రప్రదేశ్‌కి చెందిన ఇద్దరు వ్యాపారులు, సత్తుపల్లి పట్టణానికి చెందిన కొందరు ఇసుక అక్రమ వ్యాపారం సాగిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. సత్తుపల్లి పట్టణానికి పెద్ద సంఖ్యలో ఆంధ్రా నుంచి ఇసుక లారీలు ప్రతిరోజు తెచ్చి వ్యాపారం చేస్తూ రూ.లక్షల్లో గడిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇసుక అక్రమ రవాణాకు సంబంధించి పెద్ద మొత్తంలో ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నట్లు పట్టణంలో బహిరంగంగానే చర్చ జరుగుతోంది. ఇసుక అక్రమ వ్యాపారంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు వెలువడిన విషయం విదితమే. దాంతో నిఘా వర్గాలు కూడా అక్రమ ఇసుక వ్యాపారులకు సంబంధించిన పూర్తి సమాచారం సేకరించి ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఏపీ నుంచి సరిహద్దున ఉన్న సత్తుపల్లి నియోజకవర్గానికి భారీస్థాయిలో ఇసుక తరలించటం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి పెద్ద మొత్తంలో నష్టం వాటిల్లుతోంది. ఆంధ్రప్రదేశ్ నుంచి భారీస్థాయిలో అక్రమంగా ఇసుకను సత్తుపల్లి ప్రాంతానికి తరలించి విక్రయించే వారికి సంబంధించి పూర్తి సమాచారాన్ని నిఘా వర్గాలు సేకరించి రాష్ట్ర ప్రభుత్వానికి పంపినట్లు తెలిసింది. ఆంధ్రప్రదేశ్‌లోని ఏలూరు జిల్లా ఎర్రగుంటపల్లి, ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన మరో వ్యాపారి ఇసుకను సత్తుపల్లి ప్రాంతానికి తరలించి విక్రయిస్తున్నట్లు అధికారులకు సమాచారం అందింది. వీరితో పాటు సత్తుపల్లి మునిసిపాలిటీ పరిధిలోని కాకర్లపల్లిరోడ్, కల్వతరు రోడ్‌లో ఉంటున్న ఇద్దరు వ్యక్తులు కూడా ఇసుకను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారని కొందరు అధికారుల దృష్టికి వచ్చినట్లు తెలిసింది. వీరిలో ఒకరు ఏకంగా ఆంధ్రప్రదేశ్‌లో టిప్పర్ కొనుగోలు చేసి అక్కడి వ్యక్తి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించి అక్కడి ఇసుక క్వారీల నుంచి ఇసుకను సత్తుపల్లి ప్రాంతానికి తరలించి వ్యాపారం సాగిస్తున్నట్లు సమాచారం.

పెరిగిన నిఘా

ఇసుక అక్రమవ్యాపారం సాగిస్తున్న వ్యాపారుల వివరాలు బహిరంగం కావటంతో ఇసుక రవాణా చేసే వాహనాల (మిగతా 6వ పేజీలో)



ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

సంప్రదాయబద్ధంగా చక్రతీర్థం

భద్రాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీయోగానంద లక్ష్మీ నరసింహ స్వామి వారి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిసాయి. ఈ నెల 10న బ్రహ్మోత్సవాలకు శ్రీకారం చుట్టగా 11న ఎదుర్కోలు, 12న యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం నిర్వహించారు. 13న రథోత్సవం నిర్వహించగా, 14న తెప్పోత్సవాన్ని, దొంగలదోపు ఉత్సవాన్ని (మిగతా 6వ పేజీలో)



108 జిల్లా మేనేజర్‌గా శివకుమార్

బాధ్యతల స్వీకరణ

ఖమ్మం కలెక్టరేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ సంస్థ ఉమ్మడి ఖమ్మం జిల్లా ప్రోగ్రాం మేనేజర్‌గా శివకుమార్ నియమితులయ్యారు. ఇప్పటివరకు ఇక్కడ పనిచేసిన భూమా నాగేందర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో శివకుమార్ ఉమ్మడి ఖమ్మం జిల్లా (ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, మహబూబాబాద్) ప్రోగ్రాం మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 108 అత్యవసర సేవలు, 102 అమ్మ ఒడి,1962 (పశు సంచార)వాహనాలు, పార్థివ వాహనాల సేవల నిర్వహణ కోసం ప్రోగ్రాం మేనేజర్ శివకుమార్ పర్యవేక్షించనున్నారు. ఈ నేపథ్యంలో గురువారం ఆయన ఖమ్మం జిల్లా జనరల్ ఆస్పత్రిలో 108 విభాగంలో బాధ్యతలు చేపట్టారు. పలువురు సిబ్బంది ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలిచ్చి స్వాగతం పలికారు.

మహిళల చేతికే చెరువుల వన సంరక్షణ

- తొలి విడతలో మెప్మా చేతికి ఐదు ప్రధాన చెరువులు
- ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరాలో చెరువుల వన సంరక్షణ కార్యాచరణ
- జూన్ 2 నుంచి పనులు ప్రారంభం
- ఖమ్మంలో సమావేశం నిర్వహించిన మెప్మా డీఎంసీ సుజాత

ఖమ్మం సంక్షేమ విభాగం, మే 15 (ఆంధ్రజ్యోతి): పిల్లల సంరక్షణ తల్లులకు తెలిసినంతగా మరెవరికి తెలియదు. అలాగే ఇంటి పెరటిలోని మొక్కల నుంచి ఇంటి ముందు వృక్షాల పెంపకం వరకు మహిళలే కీలకపాత్ర పోషిస్తారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వం చెరువుల వన సంరక్షణలో మహిళా సంఘాలను భాగస్వామ్యం చేస్తోంది. మొక్కల పెంపకంలో నర్సరీల్లో ఇప్పటికే మహిళా సంఘాలు పనిచేస్తున్నాయి. కాగా మొక్కలు నాటటం నుంచి వాటి సంరక్షణ కూడా ఇక మహిళా స్వయం సహాయక సంఘాల సంరక్షణలో వన సంరక్షణ జరగబోతుంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నుంచి మహిళా స్వయం సహాయక సంఘాల ద్వారా చెరువుల వన సంరక్షణ చేపటనున్నారు. ఈ మేరకు ఖమ్మం జిల్లాలో మెప్మా అధికారులు కార్యాచరణ ప్రారంబించారు.

అమృత్ పథకంలో భాగంగా...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టణ ప్రాంతాల్లోని తాగునీటి సమస్య పరిష్కారం, చెరువుల నిర్వహణ కార్యక్రమాలు చేపడతాయి. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహించే అమృత్ పథకంలో ఇప్పటికే మహిళా స్వయం సహాయక సంఘాలను భాగస్వామ్యం చేశారు. పట్టణ ప్రాంతాల్లో తాగునీటి కుళాయి (మంచినీటి పంపులు) రిజిస్ట్రేషన్ నుంచి కుళాయిల ఏర్పాటు, మరమ్మతుల వరకు మెప్మా పరధిలోని మహిళా స్వయం సహాయక సంఘాలు దిగ్విజయంగా నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలోనే అమృత్ పథకంలో కొనసాగింపుగా చెరువుల వన సంరక్షణను మహిళా సంఘాలకు అప్పగిస్తున్నారు.

పట్టణం	చెరువు
ఖమ్మం	ఖానాపురం ఉరచెరువు, ధంసలాపురం చెరువు (రిషిత, అంజలి మహిళ స్వయం సహాయక సంఘాలు)
వైరా	సోమవరం చెరువు, (శృతి, ఇంధిర)
సత్తుపల్లి	వేశ్యకాంతుల చెరువు, (అంజనేయ స్వామి)
మధిర	అంబారుపేట చెరువు, (రూపా, అంకిత)



మాట్లాడుతున్న ఉద్యాన అధికారి బెల్లం రాధిక, డీఎంసీ సుజాత

కేఎంసీలో అవగాహన సమావేశం

మహిళా స్వయం సహాయక సంఘాల చేతికి చెరువుల వన సంరక్షణపై గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఖమ్మం, సత్తుపల్లి, వైరా, మధిర మునిసిపాలిటీ మెప్మా ఉద్యోగులతో డీఎంసీ సావల సుజాత సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం నుంచి వచ్చిన మార్గదర్శకాలను వివరించారు. జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా చెరువుల వన సంరక్షణ కార్యక్రమం ప్రారంభం జరుగుతుందని వంద రోజులు మెప్మా భవిష్యత్ కార్యాచరణలో చెరువుల వన సంరక్షణ పనులు ప్రత్యేకంగా చేపట్టాలన్నారు. కేఎంసీ ఉద్యాన అధికారి బెల్లం రాధిక మాట్లాడుతూ చెరువు గట్టులపై ఎటువంటి వృక్షాలను నాటాలి. నాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు మొక్కలు పెంపకంపై వివరించారు. ఏడీఎంసీ బండారుపల్లి వెంకటేశ్వర్లు, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి, ఏవో శ్రీకాంత్, కమ్యూనిటీ ఆర్గనైజర్లు సయ్యద్ సల్మా, చిలకా ద్రౌపది, రోజా, ఉపేందర్, నరేశ్ పాల్గొన్నారు.

గిరిజన గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్ కౌన్సెలింగ్

భద్రాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన సంక్షేమ గురుకుల జూనియర్ కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి గాను 810సీట్ల భర్తీ కోసం స్పాట్ కౌన్సెలింగ్ గురువారం గిరిజన గురుకుల పాఠశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా 810 సీట్లకుగాను 450 సీట్లు బాలురకు కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేశారు. మిగిలిన ఖాళీ సీట్ల భర్తీకి సంబంధించి తదుపరి చర్యలు త్వరలో ప్రకటిస్తామని ఆర్‌సీవో అరుణకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్ ద్వారా సీట్లు కేటాయిస్తున్న దృశ్యం

ఏకలవ్య విద్యాలయాల్లో ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఎనిమిది ఏకలవ్య మోడల్ సంక్షేమ విద్యాలయాల్లో సీబీఎస్‌సీ ఇంటర్ మొదటి సంవత్సరం ప్రవేశాలకు గిరిజన బాల బాలికల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఆసక్తి గలవారు ఈఎంఆర్ఎస్ విద్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ హ్యూమనిటీస్ కోర్సుల్లో దరఖాస్తు చేసుకున్న వారిని మెరిట్ మార్కుల ఆధారంగా కౌన్సెలింగ్‌లో వారికి ప్రవేశం కల్పించడం జరుగుతుందని 26న ఉదయం 9గంటలకు ఈఎంఆర్ఎస్ చర్ల, భద్రాచలంలో నిర్వహించడం జరుగుతుందన్నారు. గిరిజన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సాగర్ కాల్వకు శాశ్వత మరమ్మతులు

పరిశీలించిన ఐబీ ఎస్ఈ వెంకటేశ్వర్లు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కూసుమంచి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు సాగర్ కాల్వకు శాశ్వత మరమ్మతులు ప్రారంభం అయ్యాయి. ఎడమకాల్వ 134 కిలోమీటరు వద్ద కొట్టుకపోయిన యూటీ (అండర్ టన్నెల్) పనులు ప్రారంభించారు. ఇటీవల 'సాగర్ కాల్వ మరమ్మతుల ఊసేది.' శీర్షికన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. గతేడాది పాలేరుకు ఊహించని విధంగా ఉప్పెనలా వచ్చిన నీటి ప్రవాహంలో కొట్టుకుపోయిన ప్రాంతాల్లో శాశ్వత మరమ్మతుల వైపు పాలకులు దృష్టి సారించకపోవడం పట్ల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారంటూ ఆంధ్రజ్యోతి ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకవచ్చింది. కాలం ముంచుకు వస్తుందని అయినా అధికారుల్లో చలనం లేదని, సకాలంలో పనులు పూర్తిచేసి వచ్చే సీజన్ నాటికి అందిస్తారా... అంటూ ఉటంకించింది. ఈ క్రమంలో కాల్వల మరమ్మతులకు రూ.14కోట్లు మంజూరు అయినప్పటికీ టెండర్లు పూర్తికాలేదు. అధికారులు ప్రస్తుతానికి శాశ్వత పనులు ప్రారంభించారు

యూటీ పనులు ప్రారంభం

గతేడాది సెప్టెంబరు 1న వచ్చిన భారీ వర్షాల కారణంగా పాలేరు జలాశయానికి భారీస్థాయిలో వరద పోటెత్తింది. దీంతో నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు పెద్దఎత్తున గండ్లు పడ్డాయి. పాలేరు జలాశయానికి సమీపంలో కూసుమంచి మండలంలో మల్లాయిగూడెం వద్ద 134.5 కిలోమీటరు వద్ద గండి పడింది. ఆ ప్రాంతంలోనే అండర్ టన్నెల్ (యూటీ)కూలిపోయింది. అదేవిధంగా ఎగువన మొదటిజోన్ పరిధిలో సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం కాగితరామచంద్రాపురంలో 132.5 కిలోమీటరు వద్ద భారీగా గండ్లు పడ్డాయి. ఇదిలా ఉండగా మొదటగా అధికారులు యూటీ నిర్మాణ పనులు ప్రారంభించారు. ఈ పనులను నీటి పారుదలశాఖ ఎస్ఈ మంగళపూడి వెంకటేశ్వర్లు, క్వాలిటీ కంట్రోల్ ఈఈ రమణారావు, పరిశీలించారు. అధికారులకు పలు సూచనలు చేశారు. పనులను సకాలంలో జాగ్రత్తగా అవకతవకలకు తావులేకుండా పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఐబీ అధికారులు చంద్రకుమార్, మాధవీ, నరేష్, రవికాంత్ తదితరులు ఉన్నారు.



మల్లాయిగూడెం వద్ద యూటీ పనులు పరిశీలిస్తున్న అధికారులు

22 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

చుంచుపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు ఈనెల 22 నుంచి 29వ వరకు జరుగుతాయని నోడల్ అధికారి వెంకటేశ్వర్లు గురువారం తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు మొదటి ఏడాది పరీక్షలు, మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం ఐదున్నర గంటల వరకు రెండో ఏడాది పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రాక్టికల్స్ వచ్చే నెల 3నుంచి 12వరకు నిర్వహిస్తున్నట్లు నోడల్ అధికారి తెలిపారు.

కార్పొరేట్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

చుంచుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ జూనియర్ కళాశాలల్లో 2025-26 ఏడాదికిగాను ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి అనసూర్య గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ ఏడాది పది ఫలితాల్లో సీజీపీఏ 7.0 లేదా 400 మార్కులు పైన సాధించిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు చెందిన గ్రామీణ, పట్టణ ప్రాంత విద్యార్థులు అర్హులన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు www.telangana.epass.cgg.gov.inలో ఈ నెల 31వ తేదీ వరకు నమోదు చేసుకోవాలన్నారు.

ప్రతిసారి అదే తీరు...

- గజ ఈతగాళ్లకు మళ్లీ చెల్లింపులు మరిచారు
- పది రోజుల్లో ఇస్తామన్నారు ఆ మాటే మరిచారు



విధులు నిర్వహించిన గజ ఈతగాళ్లు వీరే

భద్రాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని గోదావరి నదీ తీరంలో విధులు నిర్వహించిన గజ ఈతగాళ్లకు జిల్లా అధికార యంత్రాంగం మళ్లీ చెల్లింపులు మరిచింది. భద్రాచలంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో ఈ ఏడాది జనవరిలో నిర్వహించిన వైకుంఠ ఏకాదశి, ఏప్రిల్‌లో నిర్వహించిన శ్రీరామనవమి సమయాల్లో గోదావరిలో భక్తుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన గజ ఈతగాళ్లకు అధికారులు చెల్లింపులు చేయలేదని తెలుస్తోంది. మొత్తం 60మంది గజ ఈతగాళ్లను మూడు షిఫ్టుల పద్ధతిలో అధికారులు విధుల్లో నియమించారని గజ ఈతగాళ్లు పేర్కొంటున్నారు. తమకు విధులు నిర్వహించిన పది రోజుల్లో చెల్లింపులు చేస్తామని హామీ ఇచ్చారని నెలలు గడుస్తున్నా.. నేటికి చెల్లింపులు చేయలేదని వారు వాపోతున్నారు. 2022లో సైతం వరదల సమయంలో గజ ఈతగాళ్లకు వేతనాలు చెల్లిస్తామని పేర్కొన్న అధికారులు ఏడాదిపాటు సాగదీసి అంతంత మాత్రంగానే చెల్లింపులు చేశారని వారు ఆక్షేపణలు వ్యక్తం చేస్తున్నారు. ఈసారి ముక్కోటి శ్రీరామనవమి సమయంలో తమను విధుల్లోకి తీసుకొని ఇంకా వేతనాలు చెల్లించలేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వేతనాలను వెంటనే చెల్లించాలని గజ ఈతగాళ్లుకోరుతున్నారు.

ముగిసిన లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలు

(5వ పేజీ తరువాయి)

నిర్వహించారు. చివరి రోజు గురువారం నాడు పవిత్ర గోదావరిలో సుదర్శన చక్రానికి చక్రతీర్థం నిర్వహించారు. పూర్ణాహుతి, ద్వాదశ ప్రదక్షిణలు, ధ్వజాఅవరోహణం తదితర కార్యక్రమాలు నిర్వహించడంతో బ్రహ్మోత్సవాలు ముగిసాయి. ఈ కార్యక్రమాల్లో ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ప్రధాన అర్చకుడు కోటి శ్రీమన్నారాయనారాయణాచార్యులు, ముఖ్య అర్చకుడు అమరవాది మధుసూదనాచార్యులు, అర్చకులు సౌమిత్రి శ్రీనివాసాచార్యులు, పొడిచేటి శేష అచ్చుత కుమారాచార్యులు పాల్గొన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

అశ్వారావుపేట, మే 15(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట వ్యవసాయ కళాశాలలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, క్షేత్ర నిర్వహణ నుంచి వృత్తులలో ఉపయోగపడే విధానాలెన్నో నిర్వహిస్తున్నారని, దీనిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని వ్యక్తిత్వ వికాస నిపుణులు జువ్వాది వెంకటేశ్వరరావు, ఎస్సీ సెల్ విభాగ అధ్యక్షుడు కోటేశ్వరరావు కోరారు. గురువారం వ్యవసాయ కళాశాలలో ఎస్సీ, ఎస్టీ విభాగం ఆధ్వర్యంలో ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమం మొదటి, రెండవ సంవత్సరం ఏజీబీఎస్సీ విద్యార్థులకు నిర్వహించారు. కార్యక్రమంలో రైతులకు ఉపయోగపడే అనేక కార్యక్రమాలపై చర్చించారు.

నడి ఎండలో నాయకుడి యాత్ర



పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

(5వ పేజీ తరువాయి)

ఐదు ప్యాకేజీల కింద ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి పనులు ప్రారంభమయ్యాయని, అందులో మూడు ప్యాకేజీలు తెలంగాణ పరిధిలోని ఖమ్మం జిల్లాలో చేపట్టినట్లు తెలిపారు. మొత్తం 165కి.మీ గాను 95 కి.మీ. ఖమ్మం జిల్లా పరిధిలోనే ఉందన్నారు. రూ.2214 కోట్లతో మూడు ప్యాకేజీల కింద జరుగుతున్న ఈ పనులు 80శాతం పూర్తయ్యాయని తెలిపారు. ఈ హైవేకు సూర్యాపేట-ఖమ్మం జాతీయ రహదారిని అనుసంధానం చేస్తూ పొన్నెకల్ నుంచి సోమవరం (వైరా) వరకు 33 కిలోమీటర్లు ప్యాకేజీ-1 కింద రూ.772 కోట్లతో చేపట్టారని, ఇందులో 30 కిలోమీటర్ల పనులు పూర్తయ్యాయని తెలిపారు. ఇక్కడ రైల్వేట్రాక్‌పై బ్రిడ్జితోపాటు అండర్‌పాస్ అలాగే హైటెన్షన్ వైర్లు ఎత్తు పెంచే పనులున్నాయన్నారు. అలాగే ప్యాకేజీ నెంబర్-2 కింద సోమవారం నుంచి పెనుబల్లి మండలం చింతగూడెం వరకు రూ.637 కోట్లతో 29 కి.మీ. గాను 26 కి.మీ. పనులు పూర్తయ్యాయని తెలిపారు. అలాగే ప్యాకేజీ-3 కింద రూ.804 కోట్లతో చింతగూడెం నుంచి వేంసూరు మండల సరిహద్దు రేజర్ల వరకు 43 కి.మీ.కు గాను 37 కిలోమీటర్ల రహదారి నిర్మాణం పూర్తయిందని మంత్రి తుమ్మల వివరించారు.

ఆగస్టు 15 నాటికి పనులు పూర్తి

ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి మొత్తం 165 కి.మీ. గాను తెలంగాణలో 95 కి.మీ.కు పైగా ఉందని తుమ్మల తెలిపారు. ఈ రహదారి పనులతోపాటు కల్వర్టులు, బ్రిడ్జీలు, అండర్‌పాస్‌లన్నీ ఆగస్టు 15 నాటికి పూర్తిచేసి జాతీయ జెండా ఎగురవేసి ఆ రహదారిపై ప్రయాణించడం జరుగుతుందని తుమ్మల వివరించారు. ఖమ్మం-దేవరపల్లి జాతీయ రహదారి ఇటు నాగపూర్ హైవేకు, సూర్యాపేట, హైదరాబాద్‌కు, ఖమ్మం-కురవి, ఖమ్మం-కోదాడ, ఖమ్మం-వరంగల్‌కు పలు జాతీయ రహదారులను అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. దాంతో తెలంగాణ, మహరాష్ట్ర, ఛత్తీస్‌గఢ్ తదితర ప్రాంతాల నుంచి ఏపీ, ఒడిశా, పశ్చిమబెంగాల్‌కు ఈ గ్రీన్‌ఫీల్డ్ హైవే కీలకంగా మారనుందన్నారు.

ఉమ్మడి రాష్ట్రంలో వాజ్‌పేయి ప్రధానిగా ఉన్నప్పుడు తెలంగాణ ప్రాంతంలోని పలు ప్రాంతాల్లో జాతీయరహదారులను ప్రతిపాదించి కేంద్రానికి పంపామని, ఆ తర్వాత రాష్ట్ర విభజన అనంతరం తాను ఆర్అండ్‌బీ మంత్రిగా ఖమ్మం-దేవరపల్లి, ఖమ్మం-సూర్యాపేట, నాగపూర్-అమరావతి, ఖమ్మం-కురవి, ఖమ్మం-కోదాడ జాతీయ రహదారులు మంజూరు చేయించినట్లు తెలిపారు. ఇటీవల రాష్ట్రానికి వచ్చిన కేంద్రమంత్రి గడ్కరికి గ్రీన్‌ఫీల్డ్ హైవే ఖమ్మం-దేవరపల్లి, నాగపూర్-అమరావతి రోడ్లకు సర్వీస్ రోడ్లు కావాలని విన్నవించామని ఇవి మంజూరైతే రైతులకు మేలు జరుగుతుందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మంత్రి వర్గంలో తనకు మంత్రిగా అవకాశం దక్కడంతో మళ్లీ రాష్ట్ర, జిల్లా అభివృద్ధిలో పాలుపంచుకోనే అవకాశం లభించిందన్నారు. జిల్లాలో నిర్మాణంలో ఉన్న జాతీయ, రాష్ట్ర రహదారులన్నీ పూర్తిచేస్తామని తెలిపారు. మంత్రి తుమ్మల పర్యటనలో సత్తుపల్లి, వైరా ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలోతు రాందాస్‌నాయక్, రాష్ట్ర గిడ్డగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నేషనల్ హైవే దేవరపల్లి హైవే పీడీ దివ్యతో పాటు ఖమ్మం అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దళారులను లోపలేయిస్తా...



చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే పాయం

(5వ పేజీ తరువాయి)

జరుగుతుందని, తమకు డబ్బులివ్వకపోతే మీ పేరు తొలగిస్తాం.. చెక్కులు రాకుండా చేస్తాం.. అంటూ కొందరు దళారులు కావాలని లబ్ధిదారులను బెదిరిస్తున్నట్టు తెలుస్తోందని వెల్లడించారు. అలాంటి వ్యక్తుల పేర్లు తనకు రాసి ఇస్తే, వారిపై కేసులు నమోదు చేయించి లోపల వేయిస్తానని తెలిపారు. దీంతో సభలో ఉన్న ప్రజలు చప్పట్లు కొట్టి సంతోషం వ్యక్తపరిచారు.

సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గానికి 3500ఇళ్లు మంజూరు చేశారని, అయితే అవి చాలవని, చాలా మందికి ఇవ్వాల్సి ఉందని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి తెలుపగా, ఆయన ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అదనంగా 700 ఇండ్లు మంజూరు చేయించారని ఎమ్మెల్యే తెలిపారు. పేదలంతా సన్న బియ్యం తింటున్నారని, గతంలో దొడ్డు బియ్యం అంతా బ్లాక్ మార్కెట్‌కు తరలిపోయేదన్నారు. ప్రభుత్వానికి అదనపు భారమైనా సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం పథకం అమలు చేస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను దేశంలో ఏ రాష్ట్రం కూడా అమలు చేయడం లేదని పేర్కొన్నారు. అనంతరం 54మందికి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఇమానియల్, మండల అభివృద్ధి అధికారి టి.శ్రీనివాసరావుపాల్గొన్నారు.

ఇసుక దందాపై పోలీస్ నజర్

(5వ పేజీ తరువాయి)

కదలికలను గమనిస్తున్నారు. అయినా అధికారుల కన్నుగప్పి ఇసుకను పలు మార్గాల్లో సత్తుపల్లికి చేరుస్తున్నారు. జిల్లా పోలీస్ అధికారి ఒకరు ఇసుక అక్రమ రవాణాపై సీరియస్‌గా ఉండటంతో నిఘా మరింత పెరిగింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేటకు చెందిన వ్యాపారి లారీని అధికారులు అశ్వారావుపేట-సత్తుపల్లి రోడ్‌లో తనిఖీ చేసి పట్టుకుని విచారణ చేపట్టారు. అధికారులు చిత్తశుద్ధితో కృషి చేస్తే ఆంధ్రా నుంచి ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవడం కష్టమేమీ కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

తహసీల్దార్ల బదిలీలు

(5వ పేజీ తరువాయి)

ఖమ్మం జిల్లా నుంచి వెళ్లినప్పటికీ ఈ జిల్లాకు చెందిన వారిని మాత్రమే తిరిగి ఖమ్మానికి కేటాయించింది. దీంతో జిల్లా నుంచి బదిలీ అయిన మిగిలిన తహసీల్దార్లు ప్రభుత్వం నిర్ణయాన్ని తప్పుపడుతున్నారు. గతంలో ఏ ప్రభుత్వమూ చేయని నిర్ణయాలను అమలు చేస్తోందని విమర్శలు గుప్పిస్తున్నారు. గురువారం రాష్ట్ర వ్యాప్తంగా 55 మందిని సీసీఎల్ఏ నవీన్ మిట్టల్ బదిలీ చేయగా.. ఖమ్మంకు నలుగురు తహసీల్దార్లకు బదిలీ అవకాశం వచ్చింది. వీరంతా శుక్ర, శనివారం జిల్లాలో రిపోర్టు చేయనున్నారు. తర్వాత వీరికి పోస్టింగులు కేటాయించనున్నారు.

ఖమ్మంకు బదిలీ అయిన తహసీల్దార్లు వీరే

పేరు	ప్రస్తుతం పనిచేస్తున్న ప్రదేశం
ఎం. రమాదేవి	భద్రాద్రికొత్తగూడెం
డి. సైదులు	మహబూబాబాద్
ఎస్. శ్వేత	మహబూబాబాద్
ఎస్వీ. నారాయణమూర్తి	మహబూబాబాద్

సంక్షేమ పథకాలకు ఆద్యుడు ఎన్టీఆర్

(5వ పేజీ తరువాయి)

దేశంలోని అనేక రాష్ట్రాల్లో అమలు చేస్తున్నారని రామకృష్ణ తెలిపారు. నీతి, నిజాయితీకి మారుపేరైన ఎన్టీ రామారావు తెలుగు జాతి ఆత్మగౌరవాన్ని కాపాడి దేశంలో తెలుగు ప్రజలకు ప్రత్యేక గుర్తింపు తెచ్చారని అన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ పాలన విఫలమైనందున రాబోయే ఎన్నికల్లో టీడీపీ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని చెప్పారు.

ఎన్టీఆర్ ట్రస్టు భవన్ ఇన్‌చార్జి టీడీ జనార్ధన్ ప్రసంగిస్తూ తెలంగాణలో తెలుగుదేశానికి మంచి భవిషత్తు ఉందని గ్రామ స్థాయిలో టీడీపీకి మంచి పట్టు ఉందని అన్నారు. ఏపీలో గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన ప్రయోగం తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో జరగనున్నదని చెప్పారు. తెలంగాణలో ప్రజలు ప్రత్యామ్నాయ రాజకీయాల కోసం ఎదురు చూస్తున్నారని, ఈ సమయంలో ప్రజలు టీడీపీకి పట్టం కట్టేలా సమాయత్తం కావాలని పిలుపు నిచ్చారు.

గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని, అన్నదాన కార్యక్రమాన్ని పోట్రు లక్ష్మయ్య ట్రస్ట్ చైర్మన్ పోట్రు ప్రవీణ్ ఏర్పాటు చేయగా, శ్రేయస్ మీడియా అధినేత గంద్ర శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా నాయకులు వాసిరెడ్డి రామానాథం, జాస్తి శ్రీనువాసరావులు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో కేతినేని హరీష్, వైఎస్ పురం మాజీ సర్పంచ్ రావి సూర్యనారాయణ, సామినేని నవీన్‌కుమార్, ఆళ్ల కమలాకర్‌రావు, మండేపూడి సాయి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



సభలో ప్రసంగిస్తున్న నందమూరి రామకృష్ణ

ఘనంగా విగ్రహావిష్కరణ

మండల పరిధిలోని వైఎస్ పురంలో గురువారం నందమూరి అభిమానుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి ఎన్టీఆర్ అభిమానులు, టీడీపీ నాయకులు భారీగా తరలి వచ్చారు. నందమూరి రామకృష్ణకు పాయపూరు స్టేజి వద్ద అభిమానులు ఎదురేగి ఘన స్వాగతం పలుకుతూ వైఎస్ పురం గ్రామంలో ఎన్టీఆర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తోడ్కొని వచ్చారు. ఈ సందర్భంగా తెలంగాణలోనే ఖమ్మం జిల్లాలో టీడీపీ సభ్యత్వం నమోదు కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేసిన హరీష్‌ను రామకృష్ణ అభినందించారు. ఈ కార్యక్రమంలో నందమూరి అభిమానులతో పాటుగా టీడీపీ నాయకుడు మందడపు సుధాకర్, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్యతో పాటుగా కల్లూరు మండల బీఆర్ఎస్ నాయకులు పాలెపు రామారావు, కట్టా అజయ్‌కమార్, లక్కినేని రఘుతో పాటుగా తదితరులు పాల్గొన్నారు.



ఆయిల్ పామ్ సాగు లాభాలను వివరించాలి

» కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్


ఆయిల్‌పామ్ సాగుపై పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, మే 15(ఆంధ్రజ్యోతి): ఆయిల్ పామ్ సాగు లాభాలను రైతులకు విస్తృతంగా ప్రచారం నిర్వహించి.. లక్ష్యాలను ప్రణాళికాబద్ధంగా చేరుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయిల్ పామ్‌సాగు, వ్యవసాయ శాఖ పనితీరుపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 8 నెలల్లో ఖమ్మం జిల్లాలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ రెండింతలు అయ్యిందన్నారు. దీనికి కృషి చేసిన అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు. జిల్లాలో ఉన్న ధాన్యం, మిర్చి, పత్తి పంట కొనుగోలు కేంద్రాల వద్ద ఆయిల్ పామ్ ఫ్లెక్సీలు, వ్యవసాయ మార్కెట్ యార్డు లలో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి ఆయిల్ పామ్ సాగు లాభాలను వివరించాలని కలెక్టర్ అన్నా రు. మక్క, వరి, పత్తి, మిర్చి పంటలు సాగు చేయడం వల్ల వచ్చే ఆదాయం, ఆయిల్ పామ్ పంట వల్ల వచ్చే ఆదాయం వివరాలతో కరపత్రాలను ముద్రించాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆయిల్ పామ్, ఉద్యానశాఖ బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి ఎంవీ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

రైతులను ప్రోత్సహించాలి

జిల్లాలో ప్రకృతి సహజసిద్ధ వ్యవసాయం వైపు రైతులను ప్రోత్సహించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రకృతి వ్యవసాయంపై అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ప్రకృతి వ్యవసాయం నేపథ్యంలో చేపట్టిన కార్యక్రమాలను అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 35 ఏళ్ల క్రితం సహజసిద్ధంగా చేసే వ్యవసాయం ద్వారా వచ్చే పంటలో పోషక విలువలు అధికంగా ఉండేవని, నేడు ఎరువులు అధికంగా వాడటం వల్ల రైతుకు పెట్టుబడి పెరగడంతో పాటు వచ్చే పంట దిగుబడిలో నాణ్యత లోపిస్తోందని అన్నారు. గ్రామాలలో ఇద్దరు రైతు మిత్రలను వారం రోజులలో ఎంపిక చేసుకోవాలని అన్నారు.

- ఖమ్మం జిల్లాలో ఏర్పాటు చేసే ప్రత్యేక ఆర్గానిక్ మార్కెట్ వద్ద కేవలం ఆర్గానిక్, న్యాచురల్ పద్ధతులలో పండిన పంటలు మాత్రమే అమ్ముకునేందుకు అవకాశం ఉంటుందని, ముందుగా పంట పొలాల దగ్గర పరీక్షలు నిర్వహించి, న్యాచురల్ పద్ధతిలో సాగు జరిగిందని ధృవీకరించిన తర్వాతే మార్కెట్ లో అవకాశం కల్పిస్తామన్నారు.

- ఆర్గానిక్ రైతు రామిరెడ్డి 25 సంవత్సరాల నుంచి వర్మి కంపోస్ట్ తయారు చేస్తున్నామన్నారు. ప్రభుత్వ గుర్తింపు పొందిన ఆర్గానిక్ మార్కెట్ ఏర్పాటు చేస్తే రైతులు న్యాచురల్ ఫార్మింగ్ వైపు పెద్ద ఎత్తున ముందుకు వచ్చే ఆస్కారం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా హార్టికల్చర్ సెరికల్చర్ అధికారి ఎంవీ మధుసూదన్, జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, రైతులు పాల్గొన్నారు.

విధులకు డుమ్మా..

» సింగరేణిలో రోజురోజుకు పెరుగుతున్న గైర్హాజరు శాతం

» బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలపై తీవ్ర ప్రభావం



రుద్రంపూర్, (సింగరేణి) మే 15 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో కారుణ్య నియామకాల ద్వారా కార్మికుల వారసులకు యాజమాన్యం ఉద్యోగ అవకాశం కల్పిస్తోంది. కార్మికుల వారసులకు మెడికల్ బోర్డు ద్వారా అన్‌ఫిట్ అయితే ఉద్యోగం ఇచ్చే సంప్రదాయం సింగరేణిలో కొనసాగుతోంది. కార్మికులు సైతం తమ వారసులకు ఉద్యోగ అవకాశం కల్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్న పరిస్థితి సింగరేణి వ్యాప్తంగా నెలకొంటుంది. దీంతో మెడికల్ బోర్డులో పెద్ద ఎత్తున పైరవీలకు తెరలేపినట్లైంది. పైరవీకారుల కను సైగలతోనే మెడికల్ బోర్డు జరిగిందనే ఆరోపణలు పెద్ద ఎత్తున వినిపించాయి. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొందిన కార్మికుల వారసులు విధులు డుమ్మా కొడు తూ జల్సా చేస్తున్నారనే ఆరోపణలో వస్తున్నాయి. కొంతమంది ఉద్యోగులు సాఫ్ట్‌వేర్ కంపెనీలో వర్క్‌ఫ్రం హోం ద్వారా విధులు నిర్వహిస్తు సింగరేణి విధులను నిర్లక్ష్యం చేస్తున్నారే ప్రచారం సాగుతోంది. సింగరేణిలో 38,379మంది కార్మికులు వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్నారు.

60మస్టర్లు చేయని కార్మికుల వివరాలు..

కొత్తగూడెం ఏరియాలో-388మంది, మణుగూరు ఏరియాలో-308, ఇల్లెందు ఏరియాలో-52, రామగుండం-1 ఏరియాలో-1,098, రామగుండం-2లో-486, రామగుండం 3లో-676, భూపాలపల్లి ఏరియాలో-1,166, బెల్లంపల్లి ఏరియాలో -68, మందమర్రి ఏరియాలో-1,011, శ్రీరాంపూర్ ఏరియాలో-2,129, ఎస్టీపీపీలో-3, కొత్తగూడెం కార్పోరేట్‌లో-66 మంది కార్మికులు విధులకు గైర్హాజరవుతున్నట్లు యాజమాన్యం గుర్తించింది. శ్రీరాంపూర్ ఏరియాలో అత్యధికంగా 2,129మంది కార్మికులు గైర్హాజరవుతుండగా ఎస్టీపీపీలో ముగ్గురు మాత్రమేవిధులకు గైర్హాజరవుతున్న పరిస్థితి నెలకొంటుంది. కార్మికులు పెద్దమొత్తంలో సింగరేణిలో యాజమాన్యం నిర్ధేశించి ఉత్పత్తి లక్ష్యం నీరుగారిపోతోంది. గత ఆర్థిక సంవత్సరం నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని నెరవేర్చకపోవడానికి కార్మికుల గైర్హాజరే ప్రధాన కారణమని తెలుస్తోంది. గైర్హాజరు కార్మికులపై యజమాన్యం కఠినంగా వ్యవహరించేందుకు రంగం సిద్ధం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ఉద్యోగం అదృష్టంగా భావించాలి

● బలరాం, సింగరేణి చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్



సింగరేణిలో ఉద్యోగం రావడం కార్మికులు అదృష్టం భావించాలి. దేశానికి విద్యుత్ అవసరాలను తీర్చే సింగరేణి సంస్థ సేవలు అందజేస్తోంది. గైర్హాజరు కార్మికులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్నామని, విధులకు సక్రమంగా హాజరుకాని కార్మికులపై చర్యలు తీసుకుంటాం. సింగరేణి ప్రభుత్వ రంగ అని ఉద్యోగం పోయిన తర్వాత బాధపడితే ప్రయోజనం ఉండదు. కార్మికులు సక్రమంగా విధులు నిర్వహించుకోవాలని సూచించారు. లేనిపక్షంలోచర్యలు తప్పవు.

మస్టర్లు చేయని 7,481 మంది కార్మికులు

ఈఏడాది సింగరేణి వ్యాప్తంగా జనవరి నుంచి ఏప్రిల్ చివరి నాటికి 1నుంచి 50మస్టర్లు చేయని కార్మికులు 7,481మంది ఉన్నట్లు సింగరేణి అధికారిక లెక్కలను బట్టి తెలుస్తోంది. 923మంది కార్మికులు విధులకే హాజరుకాని పరిస్థితి నెలకొంది. దీంతో విధులకు గైర్హాజరవుతున్న కార్మికులకు, కార్మిక కుటుంబాలకు కౌన్సిలింగ్ నిర్వహించాల యాజమాన్యం నిర్ణయించింది. సింగరేణిలో 12 ఏరియాల్లో విధులకు గైర్హాజరవుతున్న కార్మికుల పై క్రమశిక్షణచర్యలు తీసుకునేందుకు యాజమాన్యం రంగం సిద్ధం చేస్తోంది.

విద్యుదాఘాతంతో మహిళ మృతి

» మరో యువతికి స్వల్ప గాయాలు

అన్నపురెడ్డిపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో మహిళా కూలీ మృతి చెందిన సంఘటన మండలంలోని మర్రిగూడెం గ్రామంలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని అబ్బుగూడెం గ్రామానికి చెందిన మామిడి రెమెల్య(20), శ్రావణి, రూప, రాజ్‌కుమార్ ఈ నలుగురు తోబుట్టువులు కలిసి మర్రిగూడెం ధాన్యం కేంద్రంలో వడ్లు తూర్పార పట్టే కూలీ పనికి పోయారు. కాగా ధాన్యం తూర్పార పట్టేందుకు సోదరుడు రాజ్‌కుమార్ తూర్పార యంత్రాన్ని ఆన్‌చేశాడు ఈసమయంలో యంత్రానికి విద్యుత్ ప్రవహిస్తుంది, ఇది తెలియని రెమెల్య, శ్రావణి యంత్రాన్ని తాకడంతో రెమెల్య అపస్మారక స్థితిలోకి పోగా, శ్రావణికి గాయాలయ్యాయి. ఇరువురిని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించారు. వారిని పరీక్షించిన వైద్యులు రెమెల్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతురాలి సోదరుడు రాజ్‌కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టారు. స్థానిక పోలీసులు విచారణ చేపట్టారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు...

తిరుమలాయపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఏలువారిగూడెంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఏలువారిగూడేనికి చెందిన కన్నెబోయిన లింగయ్య (74) జీవితంపై విరక్తి చెంది పెట్రోలు పోసుకుని ఈనెల14న బుధవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని చికిత్స నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ లింగయ్య గురువారం మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ జగదీష్‌తెలిపారు.

దుమ్ముగూడెం మండలంలో మహిళ...

దుమ్ముగూడెం మే 15 (ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహిళ మృతి చెందిన సంఘటన బండారుగూడెంలో జరిగింది. బండారుగూడేనికి చెందిన బుద్దుల సునీత(32)కు భర్త సురేష్‌కు వంట విషయంలో వాగ్వాదం జరిగింది. కాగా భర్త ఇంట్లో లేని సమయంలో ఈనెల 10న సునీత ఇంట్లో ఉన్న క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నం చేసింది. గమనించిన కుటుంబ సభ్యులు భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు గురువారం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖమ్మం జిల్లాలో వడదెబ్బతో ముగ్గురు..

తిరుమలాయపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లేపల్లికి చెందిన వృద్ధురాలు ఇండ్ల రాజమ్మ(58) వడదెబ్బతో గురువారం మృతి చెందింది. గత వారం రోజులుగా వీస్తున్న వడగాలులకు ఆమె తీవ్ర అస్వస్థతకు గురైంది. గురువారం తీవ్ర అస్వస్థతతో మృతి చెందింది.

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని మామిళ్లగుడెం వెళ్లేదారిలో బ్రిడ్జి పక్కన గురువారం ఉదయం ఓ గుర్తు తెలియని వృద్ధుడు వడదెబ్బకు మృతి చెందినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు. అన్నం ఫౌండేషన్ సహకారంతో పోలీసుల సమక్షంలో మృతదేహాన్ని నగరంలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. గత కొంతకాలంగా మృతి చెందిన వ్యక్తి భిక్షాటన చేస్తూ బ్రిడ్జికిందనే ఉంటున్నాడని స్థానికులు తెలిపారు. గత రెండు రోజులుగా ఆరోగ్యం బాగాలేక వాంతులు చేసుకుని మృతి చెందినట్లు తెలిపారు.

ఖమ్మం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఖమ్మం రూరల్ మండలం, గుర్రాలపాడు సమీపంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం పట్టణం, శుక్రవారి పేట కాలనీకి చెందిన ఎస్‌కే.రఫీబాబు (44) కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. అయితే గురువారం గుర్రాలపాడులోని బంధువుల ఇంటికి వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. గుర్రాలపాడు సమీపంలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక రోడ్డు పక్కన కిందపడిపోయి వడదెబ్బతో మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా అన్నం శ్రీనివాస్ సహాయంతో మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరేసుకుని యువకుడి ఆత్మహత్య

తిరుమలాయపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): ఉరేసుకుని ఓ యుకువడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గురువారం మండలంలో జరిగింది. తిరుమలాయపాలెం గ్రామానికి చెందిన కొమ్ము రాజేష్(24) గురువారం అన్నదమ్ములిద్దరు గొడవపడుతున్నారు. దీంతో తల్లి పెద్దకుమారుడు రాజేష్ ను మందలించింది. దీంతో క్షణికావేశంలో ఇంట్లోనే ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతడని తిరుమలాయపాలెంలోని ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతిచెందినట్టు వైద్యులు తెలిపారు. రాజేష్ తండ్రి ఇటీవల కాలంలో మృతి చెందాడు. ఈమేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

మనోవేదనతో వ్యక్తి ...

ఖమ్మం రూరల్, మే 15(ఆంధ్రజ్యోతి): ఉరేసుకొని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఖమ్మం రూరల్ మండలం, వెంకటగిరి గ్రామంలో గురువారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వెంకటగిరి గ్రామానికి చెందిన దగ్గుపాటి గోపి(26)కు గతంలో ఇద్దరు ఆడపిల్లలు పుట్టారు. బుధవారం మూడో సంతానం కూడా ఆడపిల్ల పుట్టింది. దీంతో తీవ్ర ఆవేదనతో గురువారం ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కిందకు దించగా అప్పటికే మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాపారుల ఇళ్లలో సోదాలు

» 62 ఖాళీ బ్యాంక్ చెక్కులు, 82 ప్రాంసరీ నోట్లు స్వాధీనం

ఖమ్మం ఖానాపురంహవేలి, మే 15(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా చిట్టీలు, ఫైనాన్స్, గిరిగిరి వ్యాపారం నిర్వహిస్తున్న పలువురి ఇళ్లలో ఖమ్మం టౌన్ డివిజన్ పోలీసులు సోదాలు నిర్వహించినట్లు ఖమ్మం టౌన్ ఏసీపీ రమణమూర్తి తెలిపారు. పోలీస్ కమిషనర్ సునిల్‌దత్ ఆదేశాల మేరకు గురువారం నగరంలోని పాకబండబజార్, టీఎన్‌జీవోస్ కాలనీ, వేణుగోపాల్‌నగర్, పంపింగ్‌వెల్ రోడ్డు, గాంధీనగర్, అల్లీపురం, కొత్తగుడెం, మంచుకొండ ప్రాంతాలలో నింబధనలకు విరుద్ధంగా నిర్వహిస్తున్న అనధికారిక చిట్స్, అధిక వడ్డీలతో ప్రజలను పీడిస్తున్న ఫైనాన్స్, గిరిగిరి వ్యాపారుల ఇళ్లలో ఏకకాలంలో 8 చోట్ల దాడులు నిర్వహించి తనిఖీలు చేసినట్లు తెలిపారు. రూ.లక్షల విలువ చేసే 62 ఖాళీ బ్యాంక్ చెక్స్, 82 ప్రాంసరీ నోట్లు, 12 చిట్టి బుక్స్ లభ్యమైనట్లు పేర్కొన్నారు. చిట్స్ నిర్వాహకులు తమ కష్టమర్ల నుంచి సేకరించిన డబ్బును చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం, దౌర్జన్యాలు, దాడులు చేయడం వంటి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో నగరంలో అక్రమంగా నిర్వహిస్తున్న చిట్స్, ఫైనాన్స్, వ్యాపారుల ఇళ్లలో తనిఖీ చేసి ఆరుగురి వ్యాపారులు అక్రమంగా వ్యాపారం నిర్వహిస్తున్నారని గుర్తించి వారిపై ఖమ్మం వన్‌టౌన్, టూటౌన్, ఖానాపురంహవేలి, రఘునాథపాలెం పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

భూగర్భ జలాలను పరిరక్షించాలి


మాచినేనిపేటతండాలో మట్టి ఎత్తుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

» కలెక్టర్ జితేష్ వి పాటిల్

జూలూరుపాడు, మే 15(ఆంధ్రజ్యోతి): భూగర్భ జలాల పరిరక్షణ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని కలెక్టర్ జితేష్ వి. పాటిల్ అన్నారు. గురువారం మండలంలోని మాచినేనిపేటతండా, మాచినేనిపేట, పడమటనర్సాపురం, దండుమిట్టతండా, జూలూరుపాడు గ్రామాలలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామాలలో జలశక్తి పథకంలో భాగంగా చేపడుతున్న ఇంకుడు గంతల నిర్మాణాలను, దండుమిట్టతండాలో రైతు పొలంలో నిర్మిస్తున్న నీటికుంట నిర్మాణాన్ని పరిశీలించారు. ఉపాధి కూలీలతో మాట్లాడారు. మాచినేనిపేట పంచాయతీలోని గోపాతండాలో మహిళా రైతు చౌక్లి సాగు చేసిన మునగతోటను సందర్శించారు. చెట్లకు కాసిన కాయలను చూసి కలెక్టర్ మురిసిపోయారు. కాయలను ఎక్కడ విక్రయిస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు. జూలూరుపాడు ఉన్నత పాఠశాలలో నిర్మిస్తున్న ఇంకుడుగుంత నిర్మాణాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నీరు వృథాగా పోకుండా, ఒకే చోట నిల్వఉండకుండా ఇంకుడు గుంతలను నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇంకుడు గుంతల నిర్మాణాలలో దేశంలోనే భద్రాద్రి జిల్లా టాప్-20లో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ విద్యాచందన, ఎంపీడీవో కరుణాకర్‌రెడ్డి, ఎంపీవో తుల సీరాం, ఎంఈవో జుంకీలాల్, ఏవో దీపక్‌ఆనంద్, ఏపీవో రవి, ఏపీఎం సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

భూ పరిహారం ఇప్పించాలని వినతి

దమ్మపేట, మే15(ఆంధ్రజ్యోతి): భూ పరిహారం ఇప్పించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావును పాపకొల్లు ప్రాంతానికి చెందిన పలువురు రైతులు కోరారు. గురువారం జూలూరుపాడు మండలం పాపకొల్లు ప్రాంతానికి చెందిన పలువురు రైతులు గండుగులపల్లిలో మంత్రి తుమ్మలను క్యాంపు కార్యాలయంలో గురువారం కలిశారు. సీతారామప్రాజెక్టు కాల్వల నిర్మాణానికి భూసేకరణ ద్వారా తమ భూములు తీసుకున్నారని, రెండేళ్లనా తమకు పరిహారం చెల్లించలేదని దాదాపు 100మందిపైగా రైతులు తుమ్మల వద్ద తమగోడును వెల్లబోసుకున్నారు. తమ భూములలో సాగు కూడా చేయనివ్వడం లేదని దీని వల్ల తాము ఆర్థికంగా నష్టపోయామని వివరించారు. దీనిపై స్పందించి మంత్రి తుమ్మల భూసమస్యపై భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్‌విపాటిల్‌తో ఫోన్‌లో మాట్లాడి రైతుల సమస్యను పరిష్కరించాలని అన్నారు. మొండివర్రెగ్రామంలో కొందరు గిరిజన రైతులకు చెందిన భూములలో విద్యుత్‌లైన్లు, బోర్లు వేసుకోనివ్వడం లేదని ఆసమస్యను కూడా పరిష్కరించాలన్నారు. ఎమ్మెల్యే మట్టా రాగమయ దయానంద్‌లు తుమ్మలను మర్యాదపూర్వకంగా కలిశారు. దొడ్డా ప్రసాదు, కొయ్యల అచ్యుతరావు, మన్నెం అప్పారావు, కేవీ. సత్యనారాయణ, ఎర్రా వసంతరావు, పైడి వెంకటేశ్వరరావు, వలీపాషా, కసాని మంగేశ్వరరావు, మొగళ్లపు చెన్న కేశవరావు, తదితరులు ఉన్నారు.


మంత్రి తుమ్మలను కలిసిన జూలూరుపాడు రైతులు

గాలికుంటు వ్యాధి రహిత జిల్లాగా ఉమ్మడి ఖమ్మం

» ఏడీడీసీ, ఏడీ అరుణ

నేలకొండపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): గాలికుంటు వ్యాధిరహిత జిల్లాగా ఉమ్మడి ఖమ్మం జిల్లాను తయారు చేయటానికి కృషి చేస్తున్నట్లు పశువ్యాధుల నిర్ధారణ సంస్థ(ఏడీడీసీ)ఏడీ వి.అరుణ అన్నారు. గురువారం నేలకొండపల్లిలో ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ జాతీయ పశు వ్యాధుల నిరోధక పథకం(ఎన్‌ఈడీసీపీ) కింద పశువుల్లో గాలికుంటు వ్యాధి కనిపించకుండా 2030 కల్లా దేశం నుంచి తరిమేయటమే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తున్నదని, అందులో భాగంగానే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఏడాది 6నెలల ఒకసారి, 4నెలలు పైబడ్డ ఆవులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణా టీకాలను ఉచితంగా పశు వైద్యశాలల్లో వేస్తారన్నారు. కేంద్రప్రభుత్వం ఉమ్మడి ఖమ్మం జిల్లాలో 12 గ్రామాలను గుర్తించిందని, అందులో భాగంగానే పశువైద్య సిబ్బంది పశువుల నుంచి రక్త నమూనాలను సేకరిస్తారన్నారు. మొదటిసారి గాలికుంటు వ్యాధి నిరోధక టీకాలను వేసిన పశువుల నుంచి, టీకా వేసిన 21రోజుల తర్వాత రక్త నమూనాను సేకరిస్తారని తెలిపారు.

నేలకొండపల్లిలో నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలంలో ముజాహిద్‌పురం, జల్లేపల్లి, ఖమ్మం రూరల్‌లో కాచిరాజుగూడెం, సత్తుపల్లిలో రేగళ్లపాడు, బోనకల్‌లో ఆళ్లపాడు, మధిరలో ఆత్కూరు, తల్లాడలో కలకొడిమ, భిల్లుపాడు, వైరాలో గొల్లపూడి, సింగరేణిలో గేటుకారేపల్లి, కొణిజర్లలో పెద్ద మునగాల, కూసుమంచిలో కూసుమంచిలను ప్రస్తుతం కేంద్రప్రభుత్వం ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. అందులో భాగంగానే నేలకొండపల్లిలో 25గేదెలు, ఆవుల నుంచి రక్త నమూనాలను సేకరించినట్లు చెప్పారు. కొత్తగూడెం భద్రాచలం జిల్లాలో చర్ల, కరకగూడెం, అన్నపురెడ్డిపల్లి, అశ్వాపురం, బూర్గంపాడు, లక్ష్మీదేవిపల్లి, దమ్మపేట, పాల్వంచ, ఆళ్లపల్లి మండలాల్లో 12గ్రామాలను గుర్తించినట్లు తెలిపారు. ఈటీకాలన్నీ ప్రభుత్వం ఉచితంగా వేస్తుందన్నారు. కార్యక్రమంలో నేలకొండపల్లి పశువైద్యశాల ఏడీ డాక్టర్ రావి శ్రీనివాసరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అరుణ

తెలుగుదేశం పార్టీకి ఈ గెలుపు ఎంతో స్ఫూర్తి

» ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు


ప్రసంగిస్తున్న చంద్రబాబునాయుడు

బూర్గంపాడు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఐటీసీ పీఎస్‌పీడీ భద్రాచలం యూనిట్ లో టీఎన్‌టీయూసీ రెండోసారి గెలపొందడం తెలంగాణ తెలుగుదేశం పార్టీకి ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఏపీ ముఖ్యమంత్రి, టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు అన్నారు. ఏపీలోని మంగళగిరిలో గురువారం ఐటీసీ టీఎన్‌టీయూసీ అధ్యక్షుడు కనకమేడల హరిప్రసాద్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోటు రంగారావు ఆధ్వర్యంలో టీఎన్‌టీయూసీ కార్యకర్తలు కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబునాయుడు వారిని అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ అధికారానికి ఇన్నేళ్లు దూరంగా ఉన్నప్పటికీ యూనియన్ ఎన్నికల్లో గెలుపొందడంపై సంతోషాన్ని వ్యక్తం చేశారు. భవిష్యత్తులో కూడా ఇదేవిధంగా మంచి చేసి మళ్లీ గెలుపొందాలని కోరారు. ఈ సమావేశంలో టీఎన్‌టీయూసీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బానిస పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

» బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

చుంచుపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): బానిసత్వ వారసత్వాన్ని కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అందాల పోటీలను నిర్వహించినట్లుగానే గత ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఏనుగుల రాకేష్‌రెడ్డి అన్నారు. గురువారం భద్రాద్రి జిల్లా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా సంక్షేమ పథకాలకు నిధులు లేవంటూ ...తెలంగాణలో అందగత్తెల పోటీలకు నిధులు ఎలా వచ్చాయని విమర్శించారు. ఈ పోటీల్లో పాల్గొన్న వివిధ దేశాలకు చెందిన మహిళా అందగత్తెలకు తెలంగాణ ఆడపడుచులతో కాళ్లు కడిగేలా చేయడం మహిళా మనులను కించపరిచేలా దర్శనమిస్తున్నాయని ఆరోపించారు. మాజీ మంత్రి కేటీఆర్ తెలంగాణలో ఫార్ములా వన్‌కార్ రేస్‌ను తీసుకొస్తే విమర్శించిన వారే, నేడు ఈ అందగత్తెల పోటీలను ఎలా నిర్వహించారో ఆత్మ పరిశీలన చేసుకోవాలన్నారు. ఈ పోటీలకు వెచ్చించిన ఖర్చుపై సీఎం రేవంత్‌రెడ్డి శ్వేత పత్రం విడుదల చేయాలని స్పష్టం చేశారు. అదేవిధంగా సరస్వతి పుష్కరాలలో మంత్రుల కటౌట్ల కింద సరస్వతీ దేవి చిత్రాలు ఉండడం దారుణమని, ఈ సంఘటనపై మహిళా మంత్రులు సీతక్క, కొండా సురేఖలు తమ మంత్రి పదవులకు రాజీనామా చేసి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఏడాదిన్న ప్రజా పాలనా తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి ఏమి చేయలేదని పూర్తిగా నిరూపయోగమని మండిపడ్డారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మాజీ మున్సిపాలిటీ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, మాజీ ఎంపీపీ బాదావత్ శాంతి, సింధు, తపస్వీ, తొగరం రాజశేఖర్, వరప్రసాద్, పల్లపు రాజు, జయరాం, పూర్ణ, పురుషోత్తం పాల్గొన్నారు.

దారి దోపిడీ ముఠా అరెస్ట్

» వివరాలను వెల్లడించిన పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్


వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ సతీష్‌కుమార్

పాల్వంచ, మే 15 (ఆంధ్రజ్యోతి): దారి దోపిడీకి పాల్పడి తప్పించుకు తిరుగుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను పాల్వంచ టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. గురువారం పాల్వంచ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ కేసు వివరాలను వెల్లడించారు. దివ్యాంగుల కాలనీకి చెందిన పన్నంపల్లి తిరుమలరాజు ఈ నెల 12న రాత్రి సమయంలో తన బావమరిది మంగయ్యతో కలిసి వ్యక్తిగత పనిమీద కరకవాగు వెళ్లాడు. పని పూర్తి చేసుకుని సోనియానగర్‌కు బయలుదేరగా రైల్వే ట్రాక్ సమీపంలోకి రాగానే శేఖరంబంజరకు చెందిన బానోత్ కిషోర్, బానోత్ కుమార్, భూక్యా పవన్‌లు దారి కాచి వారి ఆటోను, వీరి ద్విచక్రవాహనానికి అడ్డుపెట్టారు. వారు ముగ్గురూ కలిసి వీరిపై భౌతిక దాడికి పాల్పడి వారి వద్ద నుంచి రూ.5 వేల నగదు, సెల్ ఫోన్‌ను లాక్కుని పరారయ్యారు. దీంతో బాధితుడు తిరుమలరాజు పాల్వంచ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన పోలీసులు నేరస్తులు ఉపయోగించిన ఆటో నెంబర్, టాప్ టైటిల్ ఆధారంగా బానోత్ కిషోర్, బానోత్ కుమార్, భూక్యా పవన్‌లు ఉద్దేశ్యపూర్వకంగా దోపిడీకి పాల్పడినట్లు తేలడంతో, వారికోసం గాలించి అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి సెల్‌ఫోన్, ఆటోను, దొంగిలించిన సొమ్ములో కొంత ఖర్చు చేయగా, మిగిలిన నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచనున్నామని తెలిపారు. సమావేశంలో పాల్వంచ సీఐ సతీష్, టౌన్ ఎస్ఐ సుమన్, సిబ్బంది పాల్గొన్నారు.

12ఏళ్ల తర్వాత బీమా సొమ్ము అందజేత

నేలకొండపల్లి, మే15(ఆంధ్రజ్యోతి): దాదాపుగా 12 ఏళ్ల అనంతరం మృతులకు బీమా సొమ్ము అందింది. వివరాల ప్రకారం..మండల పరిధిలోని కోరట్లగూడేనికి చెందిన షేక్.బోదుల్, కొత్తపల్లి వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు రూరల్ మండలం వెంకటగిరి వద్ద 1998లో జరిగిన ప్రమాదంలో మృతి చెందారు. 2003లో కేసు మృతులకు అనుకూలంగా వచ్చింది. కానీ బీమా కంపెనీ హైకోర్టుకు వెళ్లడంతో 2013లో హైకోర్టులో కేసు డిస్మిస్ అయ్యింది. కానీ మృతుల కుటుంబాలను పట్టించుకునే వారు లేకపోవడంతో, విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు బచ్చలకూరి నాగరాజు చొరవతీసుకుని, మృతుల కుటుంబాల తరపున న్యాయవాదిగా ఆకుల శేఖర్‌ను ఏర్పాటు చేశారు. న్యాయవాది శేఖర్ ద్వారా కార్మికఅధికారి పోట్ల కృష్ణవేణి సహకారంతో మృతుడు వెంకటేశ్వర్లు భార్య నాగమణికి రోడ్డు ప్రమాద బీమా కంపెనీ నుంచి మంజూరైన రూ.57వేల చెక్కును అందించారు. మృతుడు బోదుల్ భార్య మహబూబీకి రూ.60,159 అందాల్సి ఉంది. మృతుల కుటుంబాలు బచ్చలకూరి నాగరాజుకు కృతజ్ఞతలు తెలిపారు.

9 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం, మే 15 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలోని ఆర్టీవో కార్యాలయం వద్ద ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు రూ.5 లక్షల విలువైన 9 కేజీల గంజాయిని గురువారం పట్టుకున్నారు. వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా విజయవాడకు చెందిన పెడసగంటి ప్రణీత్, షేక్ కలిశాలు స్కూటీ మీద ఒడిశాలోని చిత్రకొండ నుంచి గంజాయిని తీసుకువస్తుండగా పట్టుబడ్డారు. వీరిపైన కేసు నమోదు చేసి, స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. ఈ దాడుల్లో ఎన్‌ఫోర్సుమెంట్ సీఐ సీహెచ్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ కరీం పాల్గొన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

అశ్వాపురం, మే 15(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాములపల్లి మిషన్‌భగీరథ పంప్‌హౌస్ కింద పేకాట ఆడుతున్న పేకాటరాయుళ్లను గురువారం అశ్వాపురం పోలీసులు అరెస్ట్ చేశారు. గతకొద్ది రోజులుగా కొందరు వ్యక్తులు పంప్‌హౌస్ సమీపంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా పంప్‌హౌస్ కింద పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో సీఐ జి.అశోక్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు దాడినిర్వహించి 10మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడిన వారిలో ఓ పోలీస్ కానిస్టేబుల్ కూడా ఉన్నట్లు సీఐ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.20వేల నగదు, 9సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.



ఆంధ్రజ్యోతి KHAMMAM CITY

శుక్రవారం 16 మే 2025

● ఖమ్మం ● రఘునాథపాలెం
● ఖమ్మం రూరల్
● తిరుమలాయపాలెం
● కూసుమంచి
● నేలకొండపల్లి ● కామేపల్లి

ఖమ్మం సిటీ

ZONE

పల్లెదవాఖానాలో సమయం పాటించాలి

వీవీపాలెంలో రికార్డులు పరిశీలించిన మండల వైద్యాధికారి

రఘునాథపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంత ప్రజలకు ఉన్నత స్థాయి వైద్యసేవలు అందాలని లక్ష్యంతో ఆరోగ్య ఉపకేంద్రాలను పల్లెదవాఖానాలుగా అప్‌గ్రేడ్ చేసిందని, ఎంఎల్‌హెచ్‌పీలు, సిబ్బంది ఖచ్చితమైన సమయపాలన పాటించాలని మండల వైద్యాధికారి బాలకృష్ణ ఆదేశించారు. గురువారం వీవీపాలెం పల్లెదవాఖానాను వైద్యాధికారి తనిఖీ చేశారు. హాజరు, ఇతర రికార్డులను పరిశీలించారు. సమయపాలనపై ఖచ్చితమైన ఆదేశాలిచ్చారు. సీహెచ్‌వో రమాదేవి, పర్యవేక్షకుడు తాళ్లూరి శ్రీకాంత్ పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిశీలించిన కలెక్టర్

రఘునాథపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలో అభివృద్ధి పనులకు ప్రభుత్వ స్థలాలను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ గురువారం పరిశీలించారు. రఘునాథపాలెం, పువ్వాడ ఉదయ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తహసీల్దారు లూథర్‌విల్సన్‌తో భూములు, రికార్డులను పరిశీలించారు. త్వరలో టీటీడీ ఆధ్వర్యంలో రఘునాథపాలెం మండలంలో శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి కార్యచరణ జరుగుతోంది. ఈ నేపథ్యంలో పువ్వాడ ఉదయ్‌నగర్ గుట్ట ప్రాంతాన్ని కలెక్టర్ పరిశీలించారు.



స్థలం రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఇంకా బీఆర్‌ఎస్ ప్రచారమేనా?

» మాజీ మంత్రి హోర్డింగ్‌లపై కాంగ్రెస్ నాయకుల అభ్యంతరం

రఘునాథపాలెం, మే15(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా... రఘునాథపాలెం మండలంలోని గ్రామపంచాయతీల్లో ఇంకా బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రచారమే జరుగుతోందని మండల కాంగ్రెస్ అధ్యక్షుడు వాంకుడోత్ దీప్లానాయక్ అభ్యంతరం వ్యక్తం చేశారు. చింతగుర్తిలో ఎంపీడీవో ఆశోక్‌కుమార్‌ను కలిసిన దీప్లానాయక్ గ్రామ పంచాయతీల్లో మాజీ మంత్రి ప్రచార హోర్డింగ్‌లు కొనసాగింపుపై ప్రశ్నించారు. ఎన్నికల నోటిఫికేషన్ పేరుతో కాంగ్రెస్ ఫ్లెక్సీలను తొలగించిన అధికారులు బీఆర్‌ఎస్ వాటిని ఇంకా ఎందుకు కొనసాగిస్తున్నారని ప్రశ్నించారు. బూడిదంపాడు, మంచుకొండ,ఈర్లపూడి వంటి ప్రధాన గ్రామపంచాయతీల్లో ఇప్పటికి మాజీ మంత్రి ఫ్లెక్సీలే ఉంటున్నాయని వాటిని వెంటనే తొలగించాలని కోరారు. అధికారులు చేయకుంటే కార్యకర్తలు చేయాల్సి వస్తుందని దీప్లానాయక్ హెచ్చరించారు.

మాస్టర్ ప్లాన్‌కు త్వరలో ఆమోదం

» భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి
» వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
» 20వ డివిజన్‌లో రూ.72లక్షల పనులకు శంకుస్థాపన



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంసంక్షేమవిభాగం, మే15(ఆంధ్రజ్యోతి): భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని ఖమ్మం నగరాన్ని అభివృద్ధి చేస్తున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. గురువారం ఖమ్మంనగరంలోని 20వ డివిజన్ రామచంద్రయ్యనగర్‌లో రూ.72 లక్షల అభివృద్ధి పనులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ ఖమ్మం అభివృద్ధిపై విజన్ వివరించారు. రాబోయే 20ఏళ్లలో ఖమ్మం నగరం మహానగరంగా మారుతుందని, ఆ మేరకు అంచనాలతో త్వరలో ఖమ్మం నగర మాస్టర్ ప్లాన్‌ను ఆమోదించేందుకు కావాల్సిన కార్యాచరణ జరుగుతుందన్నారు.మాస్టర్‌ప్లాన్ ఆమోదానికి ముందు ప్రజాప్రతినిధుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకుంటామన్నారు.ఆమోదం తర్వాత పెండింగ్‌లో ఉన్న భవనాలకు అనుమతులు త్వరితగతిన జారీ చేయాలన్నారు. ప్రభుత్వ భూములు పరిరక్షించాలన్నారు. రెవెన్యూ భూ సమస్యలను అదనపు కలెక్టర్, మున్సిపాలిటీకి సంబంధించిన అంశాలను కమిషనర్ పరిష్కరించాలన్నారు.నగరంలోని పేదలు ఏమి కోరుకుంటున్నారో వాటిని అధికారులు, కార్పొరేటర్లు పరిష్కరించాలని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచించారు. ఎన్నికల హామీలను ఖచ్చితంగా అమలు చేస్తున్నామని,ప్రశాంతమైన ఖమ్మాన్ని ఏర్పాటు చేసేందుకు కట్టుబడి ఉన్నామని వివరించారు. కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య మాట్లాడుతూ ఖమ్మం నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్ రూపకల్పన జరిగిందన్నారు. వారం రోజుల్లోగా డ్రాఫ్ట్ నోటిఫికేషన్ విడుదల చేస్తామన్నారు. జీవోనెంబర్ 58మేరకు పట్టాలు పొందిన వారి వివరాలను పరిశీలన చేస్తామన్నారు. త్వరలో ప్రత్యేక రెవెన్యూ క్యాంపు నిర్వహించి అర్హత కలిగిన వారికి ఇళ్లస్థలాలు అందించే ప్రక్రియను చేపడ్తామన్నారు. అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఖమ్మంలో నాగార్జునసాగర్ భూములు ఆక్రమణలు జరిగాయని తమ దృష్టికి వచ్చిందని వాటిపై విచారణ చేసి చర్యలు తీసుకుంటామన్నారు. మేయర్ పునుకొల్లు నీరజ మంత్రి తుమ్మల చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఉపమేయర్ ఫాతిమాజోహారా, కార్పొరేటర్ ప్రశాంతిలక్ష్మీ పాల్గొన్నారు.

మాస్టర్ ప్లాన్‌పై వారంలో నోటిఫికేషన్?

మేయర్‌తో సమావేశమైన కార్పొరేటర్లు

ఖమ్మం నగరం అభివృద్ధిలో ఎంతో కీలకమైన మాస్టర్ ప్లాన్‌పై క్లారిటీ పెరిగింది. ఖమ్మం మాస్టర్ ప్లాన్‌పై ఇటీవల అనేక అనుమానాలు వ్యక్తం కావటంతో గురువారం ఖమ్మం నగర పాలక సంస్థ కార్యాలయంలో మేయర్ పునుకొల్లు నీరజ కొంతమంది కార్పొరేటర్లు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. కార్పొరేటర్లు అనుమానాలను నివృత్తి చేశారు. మరో వారం రోజుల్లో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనల మేరకు ఖమ్మం నగర పాలక సంస్థ మాస్టర్‌ప్లాన్ ప్రజాభిప్రాయానికి నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉంది.

మజ్జిగ పంపిణీ



మజ్జిగను పంపిణీ చేస్తున్న సభ్యులు

నేలకొండపల్లి, మే15 (ఆంధ్రజ్యోతి): నేలకొండపల్లి, భక్తరామదాసు సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంలో బాటసారులకు మజ్జిగ పంపిణీ చేస్తుండటం తెలిసిందే. గురువారం మేళ్ళచెర్వు రంగారావు జ్ఞాపకార్థం, కుమారుడు హనుమంతరావు మజ్జిగను వితరణ చేశారు. నేలకొండపల్లి ఎస్‌బీఐ వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రం వద్ద చల్లని తాగునీటితో పాటుగా నెల రోజులుగా బాటసారులకు, బ్యాంకుకు వచ్చే ఖాతాదారులకు భక్తరామదాసు సర్వీస్ సొసైటీ వారు మజ్జిగను అందచేస్తున్నారు.కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు ఏటుకూరిప్రకాశరావు(రామారావు), మాజీ అధ్యక్షులు గెల్లా జగన్మోహన్‌రావు, వల్లంచెట్ల భాస్కరరావు,కోశాధికారి దండా రవీంద్రబాబు, దాత మేళ్ళచెర్వు హనుమంతరావు సభ్యులు ఏటుకూరి కృష్ణయ్య, బండారుపల్లి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి తుమ్మల చేయూత

ఖమ్మంసంక్షేమవిభాగం,మే15(ఆంధ్రజ్యోతి): నిరుపేద కుటుంబానికి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆర్థిక చేయూత ఇచ్చారు. 52వ డివిజన్‌కు చెందిన షేక్ ఫాతిమాకు మోకాలి ఆపరేషన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండటంతో స్థానిక నాయకులు ద్వారా విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగంధర్, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు పరిస్థితిని వివరించారు. దీంతో ఆయన రూ.1,50,000 ఎల్‌వోసీ లేఖను అందించారు. దీంతో ఫాతిమా ఆపరేషన్‌కు ఆర్థిక చేయూత కలిగింది.

నిరుపేద యువతి వివాహానికి ఆర్థికసాయం

ఖమ్మంగాంధీచౌక్, మే15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 3టౌన్‌ప్రాంతం 46వ డివిజన్‌లో నివసిస్తున్న పేదింటిబిడ్డ మాదాసు శ్రీను, కళ్యాణి కుమార్తె సింధు వివాహానికి సిటీకాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ బాణాల లక్ష్మణ్ రూ.5వేలు అందించారు. ఆపదలో ఉన్న వారికి మీకు అండగా నేనున్నానంటూ 46వ డివిజన్ ప్రజలకష్టసుఖాలలో పాలుపంచుకుంటున్నారు. ఈకార్యక్రమంలో డివిజన్ పెద్దలు జెట్ట కృష్ణయ్య, డివిజన్ బీసీసెల్ అధ్యక్షుడు తుపాకుల మధు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు ఎమ్మా రామకృష్ణ, మేకల అశోక్ యాదవ్, పూసా నాగేశ్వరరావు, వెంకటేశ్వర రావు, సింగారపు మమత మాదాసు కవిత పాల్గొన్నారు.

ఖమ్మంసంక్షేమవిభాగం: ఖమ్మం నగరంలోని 46వ డివిజన్‌కు జూబ్లీపురాకు చెందిన మాదాసు సింధు వివాహం ఈనెల 16న జరగనుంది. పేదకుటుంబం కావటంతో స్థానిక కార్పొరేటర్ కన్నం వైష్ణవి స్పందించారు. తనతో పాటుగా స్థానిక నాయకుల నుంచి విరాళాలు సేకరించి రూ.25వేలు గురువారం మాదాసు సింధు నివాసానికి వెళ్లి అందించారు. కాంగ్రెస్ నాయకులు కన్నం ప్రసన్నకుమార్, లెల్లల ప్రవీణ్, చీర సతీష్, పవన్, షేక్ రజ్జి, దేవర వెంకన్న,ఉప్పలయ్య,అచ్చినివెంకటేశ్వర్లు, చిందం సైదులు, శంకర్, అంజనేయులు పాల్గొన్నారు.



నగదు అందిస్తున్న బాణాల లక్ష్మణ్ కన్నం ప్రసన్నకృష్ణ

కేఎంసీ ఆర్వోకు స్థాన చలనం



» మహబూబాబాద్ మునిసిపాలిటీ మేనేజరుగా బదిలీ
» అక్కడ మేనేజరు ఖమ్మం ఆర్వోగా నియామకం

ఖమ్మంసంక్షేమవిభాగం, మే15(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర పాలక సంస్థ రెవెన్యూ విభాగం అధికారి జీ.శ్రీనివాసరావుకు స్థానచలనం కలిగింది. 2012లో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించారు. తర్వాత 2021నుంచి ఆర్వోగా ఇక్కడే ఉద్యోగోన్నతి దక్కింది. ఇటీవల ప్రాపర్టీ ట్యాక్స్ కలెక్షన్ సందర్భంగా బిల్‌కలెక్టర్లు, వార్డుఆఫీసర్లు రాత్రి సమయంలో ట్యాక్స్‌వసూళ్లు చేయలేమని కేఎంసీ కార్యాలయంలో బిల్లింగ్ మిషన్లు పక్కకు పెట్టి నిరసన చేపట్టారు. ఆ నిరసన కార్యక్రమంలో శ్రీనివాసరావు ఉండటం చర్చనీయాంశంగా మారింది. ఇంటి నెంబర్ల కేటాయింపులో జాప్యం, ఇంటియజమానుల పేర్లు మార్పులో జాప్యం, ప్రజావాణిలో రెవెన్యూ సమస్యలకు త్వరగా పరిష్కారం చూపలేకపోవటం వంటి కారణాలతో బదిలీ జరుగుతుందని కొంత కాలంగా చర్చ జరిగింది. కాగా ప్రాపర్టీ ట్యాక్స్ ఎర్లీబర్డ్ వసూళ్లలో సీడీఎంఏ ఇచ్చిన లక్ష్యాలను మించి వసూళ్లు చేశారు. కాగా మహబూబాబాద్ మున్సిపల్ కార్యాలయంలో మేనేజరుగా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను ఖమ్మం రెవెన్యూ ఆఫీసర్‌గా నియమించారు. సీడీఎంఏ ఇచ్చిన బదిలీ లేఖలోనే ఖమ్మం రెవెన్యూ ఆఫీసర్‌గా ఉత్తర్వులు వెలువరించారు.

నేడు విద్యుత్ అంతరాయం

ఖమ్మంరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): మండలంలోని వరంగల్‌క్రాస్ రోడ్డు సబ్‌స్టేషన్ నిర్వహణలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నారు. తల్లంపాడు, మద్దులపల్లి, పొన్నేకల్లు, తెల్దారుపల్లి, గుర్రాలపాడు, ఏదులాపురం గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ ప్రభాకర్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబాలకు నగదు అందజేత



నగదు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఖమ్మంరూరల్, మే15(ఆంధ్రజ్యోతి): కూసుమంచి మండలంలో ఇటీవల వివిధ కారణాలతో మృతి చెందిన వారిక కుటుంబాలకు నగదు సాయం అందజేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచన మేరకు కాంగ్రెస్ నాయకులు ఒక్కోకుటుంబానికి రూ.10వేలచొప్పున అందజేశారు. మండల పరిధిలోని కూసుమంచి, నాయకన్‌గూడెం, బోడియతండా, గైగోలపల్లి, లాల్‌సింగ్‌తండా, నరసింహులగూడెం, కొత్తూరు తదితర గ్రామాల్లో ఈ నగదును కాంగ్రెస్ నాయకుడు భీమిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి గురువారం బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సీడీసీ చైర్మన్ ఎర్రబోలు సూర్యనారాయణ రెడ్డి, మహ్మద్‌అఫీసుద్దీన్,మాజీఎంపీపీ జూకురి గోపాలరావు,మాజీ మార్కెట్ చైర్మన్ సెట్రం నాయక్, నాయకులు బజ్జూరి వెంకటరెడ్డి, మాజీసర్పంచులు భారీవీరభద్రం, చెన్ను మోహన్‌రావు, మెహమూద్ అలీ, జనార్ధన్‌గౌడ్, మహిపాల్,పరుశురాం,మహమ్మద్‌రఫీ, శేఖర్‌రెడ్డి, అంజిరెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకలు పాల్గొన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

ఖమ్మంఖానాపురంహవేలి,మే15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం ఓ అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. నాలుగురోజుల క్రితం ఖమ్మం జీఆర్పీ పోలీసు పరిధిలోని ఎర్రుపాలెం రైల్వేస్టేషన్ ప్రాంతంలో గుర్తుతెలియని(40)ఏళ్ల వ్యక్తి రైలు పట్టాల వద్ద మృతి చెందాడు. ఖమ్మం నుంచి విజయవాడ టికెట్ కలిగి ఉన్నాడు. మృతిడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించకపోవటంతో మృతదేహాన్ని రైల్వేపోలీసులు ఖమ్మం ఆసుపత్రి మార్చురీకి తరలించారు. ఇప్పటివరకు ఈ మృతదేహం కోసం ఎవరు రాకపోవటంతో రైల్వే పోలీసులు శవపరీక్ష నిర్వహించి మృతదేహాన్ని అంత్యక్రిల నిమిత్తం అన్నం శ్రీనివాసరావు అప్పగించారు. ఆయన గురువారం రైల్వేపోలీసులు, ఆసుపత్రి సిబ్బంది సమక్షంలో బల్లేపల్లి వైకుంఠధామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

రేపు కేఎంసీ ముట్టడి: సీపీఎం

ఖమ్మంసంక్షేమవిభాగం,మే15(ఆంధ్రజ్యోతి): 25 ప్రజా అంశాల పరిష్కారానికి శనివారం సీపీఎం ఆధ్వర్యంలో ఖమ్మం నగర పాలక సంస్థ ముట్టడి కార్యక్రమం చేపట్టిందని ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై విక్రమ్ పేర్కొన్నారు. గురువారం సుందరయ్య భవన్‌లో రఘునాథపాలెం మండల కార్యదర్శి ఎస్ నవీన్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 25అంశాలను వివరించారు. పూణే వెళ్లి పరిశీలించి వచ్చిన మేయర్ పునుకొల్లు నీరజ ఖమ్మంలో మాత్రం పారిశుధ్య వ్యవస్థను కనీసం మెరుగుపర్చలేకపోయారని ఆరోపించారు. అర్బన్ ప్రాంత ప్రజలకు ఉపాధి హామీ కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు దొంగల తిరుపతిరావు, ఎస్కే మీరా, ఉపేందర్, బోడపట్ల సుదర్శన్, నాగుల్‌మీరా,భూక్య శ్రీనివాసరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విక్రమ్

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు ప్రారంభం

ఏన్కూరు, మే15 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు క్రికెట్‌క్లబ్ ఆధ్వర్యంలో గురువాం నుంచి జరిగే మండలస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్‌ఐ మహ్మద్ హుఫాతుల్ రఫి ప్రారంభించారు. క్రీడల వల్ల శరీర ధృడత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో మేడ ధర్మారావు, తిమ్మారావుపేట లచ్చిరాంనాయక్, నాయకులు పాల్గొన్నారు.

నిబంధనలు లేకుండా ధాన్యాన్ని కొనాలి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వర రావు

వైరా,మే15(ఆంధ్రజ్యోతి): ఎలాంటి నిబంధనలు లేకుండా రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వైరా మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడాన్ని తప్పుపట్టారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యత పేరుతో తరుగు తీస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. నాయకులు సన్నే ఉదయ్‌ప్రతాప్, భూక్యా శ్యామ్, నరుకుళ్ల వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, దోసపాటి కల్యాణ్, మందడపు సుబ్బారావు, మనుబోలు వెంకటకృష్ణ, నల్లగట్ల ప్రవీణ్, ఏలూరి నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

కనీస అద్దె చెల్లించకుండానే

ఏళ్ల తరబడి మకాం

» కేఎంసీ క్వార్టర్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల ఇష్టారాజ్యం
» విచారణ ప్రారంభించిన ఏఎంసీ షఫి ఉల్లా

ఖమ్మంసంక్షేమవిభాగం, మే15(ఆంధ్రజ్యోతి): ఖమ్మంనగర పాలక సంస్థ క్వార్టర్స్‌లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు, బయట వ్యక్తులు కనీస అద్దె చెల్లించకుండా తిష్ట వేశారు. దీనిపై అసిస్టెంట్ మునిసిపల్ కమిషనర్ అహ్మద్ షఫి ఉల్లా విచారణ ప్రారంభించారు. కేఎంసీలో రెగ్యూలర్ ఉద్యోగుల కోసం గతంలో ప్రభుత్వం మునిసిపల్ క్వార్టర్స్ నిర్మాణం చేసింది. అయితే రాజకీయ పలుకబడి కలిగి కార్పొరేటర్లుతో పాటుగానే రాజకీయ పార్టీలు మార్చి అంగబలం కలిగిన కొంతమంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు కేఎంసీ క్వార్టర్స్‌లో నివాసం ఉంటూ అద్దెలు చెల్లించటం లేదు. ఈవిషయంపై ఇటీవల కేఎంసీ కమిషనర్‌కు ఫిర్యాదులు రావటంతో కొంతమంది ఉద్యోగుల వేతనాలను అధికారులు నిలుపుదల చేశారు. కాగా అసలు విషయాన్ని గోప్యంగా ఉంచిన ఉద్యోగులు తమ వేతనాలు నిలిచిపోవటానికి సరైన కారణాలను చెప్పకుండా ఇతర కారణాలతో తమకు వేతనాలు ఇవ్వటం లేదని కేఎంసీ అధికారులపై దుష్ప్రచారం ప్రారంభించారు. దీంతో స్పందించిన అధికారులు కేఎంసీ ప్రభుత్వ క్వార్టర్స్‌లో ఉంటున్న వారి వివరాలు తేల్చేందుకు విచారణ ప్రారంభించారు. గురువారం ఖమ్మంలోని మునిసిపల్ క్వార్టర్స్‌కు వెళ్లి క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించారు.



అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు నివాసం ఉంటున్న క్వార్టర్స్, విచారణ నిర్వహిస్తున్న ఏఎంసీ

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి

ఈజీఎస్ పీడీ సన్యాసయ్య

ముదిగొండ, మే15(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతీ కూలీకి పని కల్పించాలని ఈజీఎస్ పీడీ సన్యాసయ్య ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఈజీఎస్ కార్యాలయాన్ని పీడీ తనిఖీ చేశారు. ఈజీఎస్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించడంతోపాటు అదనంగా కూలీ వచ్చేవిధంగా పని చేయించాలని, ఈజీఎస్ పనుల విషయంలో ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భాస్కర్‌రావు, ఏపీవో రంగనాయకమ్మ, ఈసీ వెంకటేష్, టీఏలు రమేష్, చారి, కొమరయ్య, నగేష్, నరేష్ పాల్గొన్నారు.



రికార్డులను పరిశీలిస్తున్న పీడీ సన్యాసయ్య

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు నిర్ణీత సమయంలో సలహాలు, ఫిర్యాదులు, సూచనలు చెప్పాలని కోరారు. 9959225962 నెబర్‌కు ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

ప్రజాసేవ చేసిన వారు చరిత్రలో నిలుస్తారు

బోనకల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నిస్వార్థంగా పని చేసిన వారు చిరస్థాయిగా గుర్తుంటారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో గురువారం మాజీసర్పంచ్ వంగాల బసవయ్య 11వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌తో పాటు సొసైటీ అధ్యక్షుడిగా, నీటి సంఘం అధ్యక్షుడిగా పలు హోదాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించారని కొనియాడారు. సీపీఐ పార్టీకి అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.



- మధిర, ఎర్రుపాలెం, బోనకల్, చింతకాని, ముదిగొండ
- వైరా, కొణిజర్ల, కారేపల్లి, ఏన్కూరు, జూలూరుపాడు
- సత్తుపల్లి, కల్లూరు, తల్లాడ, వేంసూరు, పెనుబల్లి

రెవెన్యూ సదస్సులను వినియోగించుకోవాలి

బోనకల్, మే 15 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ పున్నం చందర్ కోరారు. మండలంలోని ఆళ్లపాడు, చిన్నబీరవల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఆళ్లపాడులో 185, చిన్నబీరవల్లిలో 139 దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెండింగ్ భూ సమస్యలకు సంబంధించి ఎక్కువగా రైతులు సదస్సులలో దరఖాస్తులు ఇచ్చారని తెలిపారు. రికార్డులు, క్షేత్రస్థాయిలో అన్ని విధాలుగా విచారణ జరిపి భూ సమస్యలను పరిష్కరిస్తామన్నారు. గిర్దావర్ మైథిలి, ఆత్మ చైర్మన్ పాపారావు తదితరులు పాల్గొన్నారు.

అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలి

ముదిగొండ, మే 15 (ఆంధ్రజ్యోతి): మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకంలో అడిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఈజీఎస్ పీడీ సన్యాసయ్య ఈజీఎస్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం స్థానిక ఈజీఎస్ కార్యాలయాన్ని పీడీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈజీఎస్ పనులకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అడిగిన ప్రతి కూలీకి పని కల్పించడంతోపాటు అదనంగా కూలీ వచ్చేవిధంగా పని చేయించాలని, ఈజీఎస్ పనుల విషయంలో ఎక్కడ నిర్లక్ష్యంగా వ్యవహరించకూడదని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ ఎంపీడీవో భాస్కర్‌రావు, ఏపీవో రంగనాయకమ్మ, ఈసీ వెంకటేష్, టీఏలు రమేష్, చారి, కొమరయ్య, నగేష్, నరేష్ పాల్గొన్నారు.

రుక్మిణికి సన్మానం

కల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): మానవహక్కులపై సేవలందించిన రుక్మిణి యాదవ్‌కు గురువారం కల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ చంద్రశేఖర్ సన్మానించారు. విజయవాడలో గుడ్ సమిటరిన్ ఆకాడమి వారు కల్లూరుకు చెందిన రుక్మిణికి డాక్టరేట్ అందజేశారు. హ్యూమన్‌రైట్స్ ఫౌండేషన్ తరుపున నేషనల్ ఉమెన్ వింగ్ ప్రసిడెంట్‌గా పలు ప్రాంతాల్లో మానవహక్కుల పరిరక్షణపై అవగాహన కల్పిస్తూ సేవలు అందిస్తున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవేలో పర్యటించిన మంత్రి తుమ్మల

వైరా, మే 15 (ఆంధ్రజ్యోతి): వైరా మండల పరిధిలోని గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు నిర్మాణాన్ని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. అశ్వారావుపేట నుంచి ఖమ్మం వరకు జరుగుతున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ పనులను మంత్రి తుమ్మల ప్రత్యక్షంగా పరిశీలించే కార్యక్రమం చేపట్టారు. ఆ పరిశీలనలో భాగంగానే వైరా మండలంలోని సిరిపురం గ్రామం వద్ద మంత్రి తుమ్మలకు వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సిరిపురం వద్ద సర్వీస్ రోడ్డును ఏర్పాటుచేయాలని మంత్రి తుమ్మలను పలువురు కోరారు. తుమ్మల స్పందించి అశ్వారావుపేట నుంచి ఖమ్మం వరకు అనేక చోట్ల సర్వీస్‌రోడ్లు కావాలని కోరుతున్నారని ఆ విషయాన్ని పరిశీలిస్తామని తెలిపారు. కొదుమూరు వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న హైటెన్షన్ విద్యుత్ తీగలను తొలగించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డిని ఆదేశించారు. సిరిపురాన్ని ప్రత్యేక సొసైటీగా ఏర్పాటుచేయాలని సిరిపురం మాజీ సర్పంచ్ మచ్చా నర్సింహారావు, మాజీ ఎంపీటీసీ మచ్చా వెంకటేశ్వరరావు వినతిపత్రం సమర్పించగా ఆ వ్యవహారాలను ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ చూసుకుంటారని సమాధానమిచ్చారు. రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వర



మంత్రి తుమ్మలకు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే



గ్రీన్‌ఫీల్డ్ హైవేని పరిశీలిస్తున్న మంత్రి తుమ్మల

రావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా, కొణిజర్ల మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకట నర్సిరెడ్డి, వడ్డే నారాయణరావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతారాములు, కాంగ్రెస్ ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు పుచ్చకాయల వీరభద్రం, నాయకులు మచ్చా బుజ్జీ, పమ్మి అశోక్, మట్టూరి నాగేశ్వరరావు, ధార్న రాజశేఖర్, చింతనిప్పు మాధవరావు, తేళ్లూరి వీరయ్య పాల్గొన్నారు.

వేంసూరులో

దేవరపల్లి-ఖమ్మం గ్రీన్‌పీల్డ్ హైవే రహదారిలో ఆంధ్రా సరిహద్దు ప్రాంతమైన గురుపట్లగూడెం నుంచి వేంసూరు మీదుగా వైరా వరకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం ర్యాలీగా పర్యాటించారు. వేంసూరు ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ హైవే రహదారి పనుల్లో పురోగతిని పరిశీలించారు. పర్యాటనకు వచ్చిన మంత్రి తుమ్మలకు కాంగ్రెస్ నాయకులు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజేంద్రగౌడ్, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, ఎమ్మెల్యే మట్టా రాగమయి, గ్రీన్‌ఫీల్డ్ హైవే అథార్టీ అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొణిజర్లలో

గ్రీన్‌ఫీల్డ్ హైవే వల్ల పొలాలకు వెళ్ళడానికి ఇబ్బందులు పడుతున్నామని, సర్వీస్‌రోడ్డు ఏర్పాటు చేయాలని కోరుతూ మండలంలోని పెద్దగోపతి, చిన్నగోపతి, పెద్దమునగాల, చిన్నమునగాల, బస్వాపురం, బొట్లకుంట గ్రామాలకు చెందిన రైతులు గురువారం గ్రీన్‌ఫీల్డ్ హైవేపై పర్యటించిన తుమ్మల నాగేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. రైతులతో పాటు ఆమ్‌ఆద్మీ జిల్లా అధ్యక్షులు స్వర్ణ సుబ్బారావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వడ్డే నారాయణరావు, రంజిత్ లు రైతుల బాధను మంత్రికి వివరించారు.

తల్లాడలో

ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి రోడ్డు పనులను మండుటెండలో పరిశీలిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మజ్జిగ తాగి సేదతీరారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు పనుల్లో పురోగతిని పరిశీలించేందుకు గురువారం వేంసూరు మండలం లింగపాలెం నుంచి తల్లాడ మండలం కేశ్వాపురం వరకు ర్యాలీగా వచ్చారు కేశ్వాపురం వద్ద ఆగినప్పుడు మంత్రి తుమ్మలతో పాటు రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు , గ్రీన్‌ఫీల్డ్ నేషనల్ హైవే అథారిటీ మేనేజర్ దివ్య, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మజ్జిగ తాగి సేదతీరారు.



మండుటెండలో మజ్జిగ తాగి సేదతీరుతున్న తుమ్మల

నేడు డయల్ యువర్ డీఎం

సత్తుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి ఆర్టీసీ డిపో పరిధిలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకూ డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు సత్తుపల్లి డిపో మేనేజర్ యూ.రాజ్యలక్ష్మి తెలిపారు. డిపో పరిధిలోని ప్రయాణికులు నిర్ణీత సమయంలో సలహాలు, ఫిర్యాదులు, సూచనలు చెప్పాలని కోరారు. 9959225962 నెంబర్‌కు ఫోన్ చేయాలని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు వినియోగించుకోవాలని కోరారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు



ట్రాన్స్‌ఫార్మర్ అమరుస్తున్న సిబ్బంది

సత్తుపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలోని కల్పతరు రోడ్‌లో విద్యుత్ లోడ్ సరిపోకపోవడంతో వినియోగదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని కొత్త విద్యుత్ ట్రాన్స్‌పార్మర్‌ను గురువారం విద్యుత్ సిబ్బంది ఏర్పాటు చేశారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా రూ.4.5లక్షల వ్యయంతో దీనిని అమర్చినట్లు ఏడీఈ ప్రసాద్‌బాబు తెలిపారు.

పేద విద్యార్థినికి ఆర్థికసాయం

వేంసూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన తేజస్వి ఇటీవల విడుదలైన పదోతరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్కులు సాధించింది. పైచదువులకు వెళ్లేందుకు తేజస్వికి విశ్వబ్రాహ్మణ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు గన్నోజు గోవిందమ్మ గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా తేజస్విని శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో టి.కృష్ణమాచారి, విశ్వబ్రాహ్మణసంఘం నాయకులు పాల్గొన్నారు.

కల్యాణి కుటుంబానికి పరామర్శ



కల్యాణి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే రాగమయి

పెనుబల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మళకుంట గ్రామానికి చెందిన భూక్యా కల్యాణి ఇటీవల మృతిచెందగా ఆమె కుటుంబాన్ని గురువారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి పరామర్శించారు. కల్యాణి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పంది వెంకటేశ్వరరావు, నాయకులు సోమరాజు సీతారామారావు, చీకటి రామారావు, కీసర శ్రీనివాసరెడ్డి, ఏటుకూరి హరీష్, బాణోతు చక్రీయ, బుక్యా కృష్ణవేణి, రాధాకృష్ణ పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్.రఫి

ఏన్కూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏన్కూరు క్రికెట్ క్లబ్ ఆధ్వర్యంలో గురువాం నుంచి జరిగే మండలస్థాయి క్రికెట్ పోటీలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ఎస్ఐ మహ్మద్ హాఫాతుల్ రఫి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల వల్ల శరీర ధృడత్వంతోపాటు మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. క్రీడల్లో గెలుపోటములు సహజమని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ రైతుబంధు సమితి అధ్యక్షుడు మేడ ధర్మారావు, తిమ్మరావుపేట మాజీ ఎంపీటీసీ లచ్చిరాంనాయక్, నాయకులు పూర్ణకంటి మైసారావు, తాళ్లూరి నవీన్, ముక్తి వెంకటేశ్వర్లు, నాగరాజు, వంశీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

చింతకాని, మే 15 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ ఖమ్మం పట్టణం గోపాలపరానికి చెందిన కొర్రా లోకేష్ (24) గురువారం మృతిచెందాడు. మృతుడు ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగి. ఈ నెల 7వ తేదీన ఉద్యోగ పనుల నిమిత్తం పొద్దుటూరు గ్రామం వెళ్తుండగా బోనకల్ మేజర్ సమీపంలో ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నాటి నుంచి ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. మృతుని భార్య భద్రమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బేషరతుగా ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

» బీజేపీ జిల్లా అధ్యక్షుడు కోటేశ్వర రావు



ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న కోటేశ్వరరావు

వైరా, మే 15 (ఆంధ్రజ్యోతి): ఎలాంటి ఆంక్షలు లేకుండా బేషరత్‌గా రబీ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. గురువారం వైరా మండలంలోని పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ధాన్యం కొనుగోళ్ల తీరు పట్ల ఆగ్రహం వ్యక్తంచేశారు. ఐకేపీ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లు చేయకపోవడాన్ని తప్పుపట్టారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. నాణ్యత పేరుతో తరుగు తీస్తే సహించేది లేదని హెచ్చరించారు. రాష్ట్రంలో రైతులకు రక్షణ లేకుండా పోయిందని విమర్శించారు. నాయకులు సన్నే ఉదయ్‌ప్రతాప్, భూక్యా శ్యామ్, నరుకుళ్ల వెంకటేశ్వర్లు, గుత్తా వెంకటేశ్వర్లు, దోసపాటి కల్యాణ్, మండదపు సుబ్బారావు, మనుబోలు వెంకటకృష్ణ, నల్లగట్ల ప్రవీణ్, ఏలూరి నాగేశ్వరరావు తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

భూ సమగ్ర సర్వేతో సమస్యలకు పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న గోపాలరావు

బోనకల్, మే 15 (ఆంధ్రజ్యోతి): భూ సమగ్ర సర్వేతోనే సమస్యలకు పరిష్కారం సాధ్యమవుతుందని మడిపల్లి గోపాలరావు తెలిపారు. స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం జరిగిన పార్టీ మండల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. భూ భారతి చట్టంలో లోపాలను సవరించాలని, తప్పు చేసే అధికారులపై చర్యలు తీసుకునే అధికారాలను కూడ చట్టంలో పొందుపరచాలని డిమాండ్ చేశారు. దుమ్ముగూడెం ప్రాజెక్టును యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని, గోదావరి జలాలను పాలేరుకు అనుసంధానం చేయాలని కోరారు. ఈ సమావేశంలో సీపీఎం నాయకులు పొన్నం వెంకటేశ్వరరావు, చింతలచెర్వు కోటేశ్వరరావు, మండల కార్యదర్శి కిలారు సురేష్, జొన్నలగడ్డ సునీత, నాగేశ్వరరావు, శ్రీనివాసరావు, తెల్లాకుల శ్రీనివాసరావు, కేతినేని నాగేశ్వరరావు, నోముల పుల్లయ్య, కొమ్మినేని నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

» రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపు

కారేపల్లి మే 15 (ఆంధ్రజ్యోతి): ఈనెల 20న సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని మండల రౌండుటేబుల్ సమావేశంలో పలు రాజీకీయపార్టీలకు చెందిన నాయకులు పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని బాగం రామానర్సయ్య భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ.. నరేంద్ర మోది ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టేందుకు కార్మిక కర్షక సంఘాలన్నీ ఏకంకాలని పిలుపినిచ్చారు.

కొణిజర్లలో

మే 20న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని వ్యవసాయకార్మికసంఘం జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. గురువారం సమ్మె విజయవంతం కోసం వామపక్ష ప్రజాసంఘాల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శతాబ్ధకాలంగా కార్మికవర్గం అనేక త్యాగాలు, పోరాటాలు చేసి సాధించుకున్న 29 కార్మికచట్టాలను రద్దు చేసి వాటి స్థానంలో నాలుగు లేబర్‌కోడ్‌లు తీసుకొచ్చారని, అవి అమలు జరిగితే కార్మికులు నష్టపోతారని తెలిపారు. నాయకులు కుటుంబరావు, మాధవరెడ్డి, సీతరాములు, శ్రీనివాసరావు, ధనరాజ్, యోహాన్, అంజయ్య, సోమయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లాడలో

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి కోరారు. గురువారం స్థానిక దొడ్డ కృష్ణయ్య భవన్‌లో బీజేపీయేతర రాజకీయపార్టీలు, ప్రజాసంఘాల ముఖ్యనాయకులు సమావేశం సీపీఎం మండల కార్యదర్శి అయినాల రామలింగేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను కార్పొరేట్ అనుకూల విధానాలను నిరసిస్తూ ఈనెల 20న అఖిల పక్ష రైతు సంఘాల, కార్మిక సంఘాలు, ఉద్యోగ సంఘాలు సమ్మెకు పిలుపునిచ్చాయని, ఈ సమ్మెకు బీజేపీయేతర రాజకీయపార్టీలన్నీ మద్దతు ఇచ్చాయని తెలిపారు దేశంలో ఉన్న 90శాతం మంది ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పక్కన బెట్టి సామ్రాజ్యవాద విధానాలకు అనుకూలంగా దేశ ప్రజల ప్రయోజనాలను పక్కనబెట్టి పరిపాలన సాగిస్తున్న మోదీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలందరు ఐక్యంగా తమ హక్కులను కాపాడుకోవడం కోసం సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లానాయకుడు చలమాల విఠల్‌రావు, టీయూసీఐ జిల్లా నాయకుడు డి.శ్రీనివాసరావు, షేక్ లాల్‌మియా, రైతుసంఘం మండల అధ్యక్షుడు కృష్ణయ్య, కార్మిక సంఘం నాయకులు మస్తాన్ చల్లా నాగేశ్వరరావు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో నాయకులు



సమావేశంలో మాట్లాడుతున్న శీలం సత్యనారాయణరెడ్డి

అగ్రిగోల్డ్ బాధితులకు ప్రభుత్వం న్యాయం చేయాలి

» అగ్రిగోల్డ్ వెంచర్‌ను సందర్శించిన సీపీఐ నాయకులు

కల్లూరు, మే 15 (ఆంధ్రజ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అగ్రిగోల్డ్ బాధితులకు న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర నాయకుడు యర్రబాబు అన్నారు. గురువారం కల్లూరు మండల పరిధిలోని కప్పలబంధం గ్రామంలో అగ్రిగోల్డ్ వెంచర్‌ను ఆయనతోపాటుగా అగ్రిగోల్డ్ బాధితులు కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా యర్రబాబుతో పాటుగా అగ్రిబాధితులు మాట్లాడతూ.. 2014 వ సంత్సరంలో అగ్రిగోల్డ్ కంపెనీ మూత పడిన దగ్గర నుంచి నేటి వరకు అగ్రిగోల్డ్ వెంచర్లు అక్రమణకు గెరయ్యాయని వాటిని ఇతర వ్యక్తులు అక్రమించారని చెప్పారు. కప్పలంబంధం గ్రామంలో 290 ఎకరాల వెంచర్ అక్రమణకు గురైందన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ వెంచర్లను జప్తు చేసి బాధితులకు న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. 1995 లో ప్రారంభించి అగ్రిగోల్డ్ కంపెనీలో డిపాజిట్లు చేస్తే ఎక్కువ లాభాలు ఉంటాయని నమ్మించి ఈ రూపంలో తెలంగాణతో పాటుగా ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో సుమారు 5 వేల కోట్లు వసూలు చేసి యాజమాన్యం చేతులేత్తేసి బాధితులకు మోసం చేసిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీ మూత పడి పది సంత్సరాలు గడిచిన బాధితులకు న్యాయం జరగలేదన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అగ్రిగోల్డ్ సమస్య పై విచారణ జరిపి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని వారు కోరారు. ఈ మేరకు అగ్రిగోల్డ్ బాధితుల సంఘం తరుపున ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అగ్రిగోల్డ్ బాధితుల సంఘం రాష్ట్ర కార్యదర్శి గోగుల వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శి వి రాజు, మైలవరపు లక్ష్మి, కె.సతీష్, ప్రకాష్, రాజకుమారి, సైదులు, మురళి, పుష్ప, జాను, రవి తదితరులు పాల్గొన్నారు.



కల్లూరు ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న అగ్రిగోల్డ్ బాధితులు

న్యాయాధికారి కార్తిక్‌రెడ్డి సేవలు ఆదర్శనీయం

మధిరటౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): గొప్ప మానవతా విలువలు కలిగన వ్యక్తి కార్తీక్‌రెడ్డి అని మధిర కోర్టు న్యాయమూర్తి వేముల దీప్తి అన్నారు. మధిర కోర్టు నుంచి బదిలీపై వెళుతున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డిని గురువారం మధిర కోర్టులో బార్‌అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు, ఈ సందర్భంగా ప్రస్తుత న్యాయమూర్తి దీప్తి మాట్లాడుతూ.. పేదలకు న్యాయం చేయాలనే తపనతో కార్తీక్‌రెడ్డి నిరంతరం పనిచేశారని అలాగే కేసుల తక్షణ పరిష్కారం కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. బదిలీపై వెళుతున్న న్యాయమూర్తి కార్తీక్‌రెడ్డి మాట్లాడుతూ.. బెంచ్, బార్‌అసోసియేషన్ కలిసి పనిచేస్తేన సత్వర న్యాయం దొరుకుతుందని మధిర కోర్టులో న్యాయవాదుల సహకారం వల్లే అనేక కేసులు పరిష్కారం అయ్యాయని అన్నారు. బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు బోజెడ్ల పుల్లారావు న్యాయవాదులు వాసంసెట్టి కోటేశ్వరరావు, కట్టా పూర్ణచందర్ రావు, దిరిశాల జగన్మోహనరావు, చావలి రామరాజు, వాసిరెడ్డి కోటేశ్వరరావు, సుబ్రహ్మణ్యం, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సేవ చేసిన వారు చరిత్రలో నిలుస్తారు



నివాళులర్పిస్తున్న సీపీఐ నాయకులు

బోనకల్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రజల కోసం నిస్వార్ధంగా పని చేసిన వారు చిరస్థాయిగా గుర్తుంటారని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు జమ్ముల జితేందర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని మోటమర్రి గ్రామంలో గురువారం మాజీ సర్పంచ్ వంగాల బసవయ్య 11వ వర్ధంతి సందర్భంగా ఆయన స్థూపానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్పంచ్‌తో పాటు సొసైటీ అధ్యక్షుడిగా, నీటి సంఘం అధ్యక్షుడిగా పలు హోదాల్లో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సేవలందించారని కొనియాడారు. సీపీఐ పార్టీకి అందించిన తోడ్పాటు మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా, మండల నాయకులు బెజవాడ రవిబాబు, యంగల ఆనందరావు, ఎం.ఏ రహీం, కృష్ణ, బుర్రి నాగేశ్వరరావు, బ్రహ్మం, వెంకటేశ్వర్లు, వంగల నరేందర్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గుండా గాంధీకి మాజీ ఎమ్మెల్యే నివాళి



కారేపల్లి మే 15 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కోయగుంపుగ్రామానికి చెందిన ప్రముఖ వ్యాపారి గుండాగాంధీ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. గురువారం ఆయన నివాసంలో జరిగిన దశదిన కర్మలో వైరా మాజీ ఎమ్మెల్యే బాణోత్‌మదన్‌లాల్ హజరై గాంధీచిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళులర్పించారు. గాంధీసేవాలను కొనియాడారు.

విద్యుత్ కోతలు ఇంకెన్నాళ్లు..?

» మరమ్మతుల పేరుతో విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం

ఏన్కూరు, మే 15 (ఆంధ్రజ్యోతి): ఏళ్లతరబడి మరమ్మత్తులు పేరుతో విద్యుత్ సరఫరాకు తీవ్రమైన అంతరాయం కలిగిస్తున్న ఏన్కూరు మండల విద్యుత్ శాఖ అధికారుల పనితీరు ఇది. అధికారుల తీరుపై మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. చెట్ల కొమ్మలు నరకడం, వైర్లను లాగడం, కొత్త పోల్స్ వేయడం వంటి మరమ్మత్తులు చేపడితే సాధారణంగా నెల లేదా రెండునెలల సమయం పడుతుంది.. ఇక్కడ మాత్రం ఏళ్లతరబడి తాత్కాలిక మరమ్మత్తులు చేస్తూ విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలిగిస్తున్నారు. దీనివల్ల ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా పోతోంది. వినియోగదారులు ప్రశ్నిస్తే మరమ్మత్తులు చేయొద్దంటారా అని ఎదురు ప్రశ్నిస్తున్నారు. వారంలో మండలంలోని ఏదో ఒక విద్యుత్ సబ్‌స్టేసన్ పరిధిలో గంటల కొద్ది విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడం పరిపాటిగా మారింది. దీనికి తోడు సాయంత్రం వేళ్లలో ఏ కొద్దిపాటి గాలి వచ్చినా సరఫరాకు రెండు, మూడు గంటలు అంతరాయం కలుగుతుంది. ఉదాహరణకు బుధవారం రాత్రి రెండుగంటల అంతరాయం కలిగింది. మళ్లీ తిరిగి ఉదయం రెండు గంటలు అంతరాయం కలిగింది. ఎల్‌సీల పేరుతో అక్రమంగా ఇష్టం వచ్చినట్లు సరఫరా నిలిపివేస్తున్నారు. వృద్ధులు, చిన్నపిల్లలు వేసవిలో ఉక్కపోతకు తట్టుకోలేక విలవిలాడిపోతున్నారు. సర్వీస్ మీటర్లు, సర్వీస్ వైర్లు, పోల్స్‌ను ముడుపుల తీసుకుని ఇష్టం వచ్చినట్లు మారుస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ముడుపులు ముడితే ఏపనైనా చేస్తారని విమర్శలు వినిపిస్తున్నాయి. అధికారులు సిబ్బంది మధ్య సమన్వయ లోపం ఎవరికివారే యమునా తీరే అనే సామెతను తలపిస్తోంది. విద్యుత్ శాఖ అధికారులు ఫోన్లు ఎత్తరు, ఎత్తినాసరైన సమాధానం చెప్పరు. గతంలో ఎప్పుడు పోలేదా? ఇప్పుడే కొత్తగా పోతుందా? ఆగు వస్తది? అనే సమాధానం చెబుతున్నారని వినియోగదారలు వాపోతున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని మండల ప్రజలు కోరుతున్నారు.



సబ్‌స్టేషన్ కార్యాలయం